Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 111 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 మే 2023 శనివారం పేజీలు : 4

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుపతి : తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు 20 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. కాగా.. మంగళవారం తిరుమల శ్రీవారిని 67, 681 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

31,738 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.54 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.



# మహారాష్ట్రపై కేసీఆర్ గంపెడాశలు

# 'కారు సారు' వ్యూహం ఫలిస్తుందా!?

## సభ్యత్వాల నమోదుతో దుమ్ము రేపాలని డిసైడైన కేసీఆర్!!

హైదరాబాద్ : రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని కేసీయార్ తీవ్రంగా కృషిచేస్తున్నారు. ఇంతకీ కేసీయార్ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నది తెలంగాణాలో కాదు మహారాష్ట్రలో. తెలంగాణా ఎన్నికల్లో మళ్ళీ గెలవబోయేది బీఆర్ఎస్ అని కేసీయార్ చాలా ధీమాగా ఉన్నారు. కాబట్టి గెలుపుపై ప్రయత్నాలు చేయాల్సింది మహారాష్ట్రలోనే అనేది కేసీయార్ ఆలోచన. 288 సీట్ల అసెంబ్లీలో ఈజీగా మెజారిటి సీట్లు గెలుచుకోవచ్చని భావిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ఎలక్షనీరింగ్ చేస్తే గెలుపు అంత కష్టమేమీ కాదన్నది కేసీయార్ ఆలోచనగా చెబుతున్నారు పార్టీ నేతలు. అందుకనే ముందు పార్టీ సభ్యత్వాలపై దృష్టిపెట్టారు. నేటి నుంచి వచ్చేనెల 10 వరకు సభ్యత్వాల నమోదు కార్యాచరణ ప్రకటించారు. ఇందులో సాధారణ సభ్యత్వాలు క్రియాశీల సభ్యత్వాలని విభజించారు. ఏ పార్టీలో అయినా ఇలాగే ఉంటుంది కానీ ఇక్కడ కేసీయరా పెట్టిన షరతు ఏమిటంటే క్రియాశీల సభ్యులకే భవిష్యత్తులో పదవులు కీలక బాధ్యతలను అప్పగిస్తారట. ప్రతి నియోజకవర్గంలో తక్కువలో తక్కువ 50 వేల సభ్యత్వాలు చేయాలని ఆదేశించారు. ఇందులో సుమారు వెయ్యిమంది క్రియాశీల సభ్యులుగాను 10 వేలమంది మహిళలను సభ్యులుగా చేర్చాలని కేసీయార్ ఆదేశించారు. మహారాష్ట్రలో యాక్టివ్‌గా ఉండే కొన్ని పార్టీల నుండి కొందరు సీనియర్ల యువతను కేసీయార్ బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు. వాళ్ళందరితో రెగ్యులర్ గా టచ్ లో ఉన్నారు. రైతులు మహిళలు యువతను సభ్యులుగా చేర్చుకోవటంపైనే కేసీయార్ ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామస్థాయి నుండి నగరాల్లోని ప్రతి ఇంటికి వెళ్ళి తెలంగాణాలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను వివరించేందుకు ప్రత్యేక బృందాలను ఇప్పటికే రంగంలోకి దింపేశారు. మహారాష్ట్రలో వ్యవహారాలను జనావుగా జరిపేందుకు పర్యవేక్షించేందుకు సరిహద్దు జిల్లాలైన నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిదులు నేతలకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించారు. సాధారణ ఎన్నికలకన్నా ముందే జరగబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నది కేసీయార్ టార్గెట్ గా పెట్టుకున్నారు. కొంతకాలంగా మహారాష్ట్రలో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో జనాలు విసిగిపోయున్నారన్నది కేసీయార్ అంచనా. అందుకనే బీఆర్ఎస్ ను జనాలు ఆధరిస్తారని కేసీయార్ ఆశలు పెట్టుకున్నారు. చివరకు ఏమవుతుందో చూడాల్సిందే.



## బాధ్యతలు స్వీకరించిన సోమేశ్ కుమార్

హైదరాబాద్: తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పదవి అప్పగించింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముఖ్య సలహాదారుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శుక్రవారం ఉదయం సీఎం ప్రధాన సలహాదారునిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు. రాష్ట్ర విభజన సమయంలో సోమేశ్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించినా.. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్) ఉత్తర్వుల మేరకు తెలంగాణలోనే కొనసాగారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పని చేశారు. అయితే క్యాట్ ఉత్తర్వులను డీవోపీటీ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేయడంతో హైకోర్టు ఆయనను తక్షణం ఏపీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మరో అవకాశం లేకపోవడంతో 2023 ఫిబ్రవరిలో ఆయన ఏపీ జీఏడీలో రిపోర్టు చేశారు. ఆ వెంటనే హైదరాబాద్‌కు వచ్చారు. ఏపీ ప్రభుత్వం కూడా ఆయనకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. ఒక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, మరో రాష్ట్రంలో అంతకంటే తక్కువ పోస్టులో పని చేయడానికి సోమేశ్ ఇష్టపడలేదు. సోమేశ్ కుమార్‌ను తన ప్రధాన సలహాదారుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించడంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. అవ్వడానికి ప్రభుత్వ ప్రధాన సలహాదారు పదవే అయినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ కోసం సోమేశ్ కుమార్ పనిచేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవం సోమేశ్‌కు ఉండనే ఉంది. ప్రజల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న అసంతృప్తిని తగ్గించే మార్గాలను అన్వేషించడమే సోమేశ్ విధిగా తెలుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విక్టరీనే లక్ష్యంగా సోమేశ్ పాలనాపరంగా పావులు కదపనున్నారు. అయితే.. రాజకీయంగా సోమేశ్ నియామకం పెను దుమారాన్ని రేపింది. ప్రతిపక్షాలు సోమేశ్‌కు కొలువు కట్టబెట్టడంపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టాయి.

# రేవంత్ రెడ్డి వ్యూహం సక్సెస్ అవుతుందా?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చెక్ పెట్టడానికి కాంగ్రెస్ రెడీ అవుతోంది. తమ వంతు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా మొదటి నుంచి కేసీఆర్ పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉండే రేవంత్ రెడ్డి ఎన్నికలకు ఆరేడు నెలలు మాత్రమే ఉండడంతో స్పీడ్ పెంచారు. కాంగ్రెస్ అధినాయకులను తీసుకొచ్చి తెలంగాణలో యాక్టివ్ పాలిటిక్స్ చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం శతవిధాలా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్లు సహకరించకపోయినా.. తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి వివిధ డిక్లరేషన్ల పేరుతో అటు ప్రజా మద్దతును కూడగట్టడానికి.. అటు అధిష్టానం వద్ద పట్టు సంపాదించడానికి కష్టపడుతున్నాడు. గతంలో రైతాంగ సమస్యల పై రాహుల్ గాంధీని తెలంగాణ కు రప్పించి వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్ ను రేవంత్ ప్రకటించారు. ముఖ్యంగా కీలకమైన ధరణి పోర్టల్ రద్దు చేస్తామని.. ధరణి వల్ల ఇబ్బందిపడిన రైతులకు అండగా నిలుస్తామని చెప్పారు. రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ డిక్లరేషన్ ఆకట్టుకునే విధంగా ఉంది. తాజాగా రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్య పై ప్రధాన ఏజెండాగా తీసుకొని యూత్ ను టార్గెట్ చేసి డిక్లరేషన్ ప్రకటించారు. యువ సంఘర్షణ పేరుతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రియాంక గాంధీని ఆహ్వానించి యూత్ డిక్లరేషన్ ప్రకటించారు. నిరుద్యోగం లేని తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేస్తామని ప్రకటించారు. నిరుద్యోగులు అందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీలు ఇచ్చారు. నిరుద్యోగులకు రూ. 4వేల భృతి నిరుద్యోగుల కోసం 7 జోన్లలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు.. ప్రైవేటు కంపెనీల్లో తెలంగాణ యువతకు 75శాతం రిజర్వేషన్.. బాసర ఐఐఐటీ తరహాలో మరో నాలుగు ఐఐఐటీల ఏర్పాటు.. 18 ఏళ్లు పైబడి చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ యువతకు రూ. 10 లక్షల వరకూ వడ్డీ లేని రుణం అందిస్తామని తెలిపారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్లాన్ రెడీ చేస్తోంది. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సహా స్థానిక కాంగ్రెస్ నేతలంతా తెలంగాణలోని ప్రధాన సమస్యలపై ఫోకస్ చేస్తున్నారు. డిక్లరేషన్లతో వేడి పుట్టిస్తున్నారు. యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీ యువతను ఆకర్షించే విధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి యువత మద్దతు ఎంతవరకు ఉంటుందనేది తెలియాల్సి ఉంది.

# కర్నాటకలో క్యాంప్ రాజకీయాలు

# హంగ్ కంగారు తోనేనా!?




కర్నాటకలో ఎన్నికలు ముగిసాయి. ఈ నెల 13న ఫలితాలు రానున్నాయి. అయితే ఏకపక్షంగా ఏ అయినా పార్టీ విజయం సాధిస్తుంది అని ఎగ్జిట్ పోల్ సర్వేలలో ఎక్కడా చెప్పడంలేదు. పైగా ఒకటి రెండు సర్వేలు తప్ప అన్నీ కూడా ఈసారి హంగ్ తప్పదని స్పష్టం చేస్తున్న నేపథ్యం ఉంది. దాంతో తమకే ఎక్కువ సీట్లు వస్తాయని కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ఇపుడు కంగారు పడుతోంది. ఒక వేళ అనుకోనిది జరిగి హంగ్ అసెంబ్లీ వస్తే సంగతేంటి అన్న కలవరం ఆ పార్టీని పట్టి పీడిస్తోంది. ఈ నేపథ్యంలో క్యాంప్ రాజకీయాలను షురూ చేసింది అని తెలుస్తోంది. కర్నాటకలో ఈ నెల 10న ఎన్నికలు జరిగాయి. మొత్తం 224 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇందులో సగానికి ఒకటి కలిపితే 113 సీట్లు వచ్చిన పార్టీదే అధికారం. కాంగ్రెస్ సింగిల్ లార్జెస్ట్ పార్టీ గా ఉంటుందని సర్వేలు అన్నీ ఘోషిస్తున్నాయి.

అయితే 113 సీట్లు దాటి సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పెద్దలు నమ్ముతున్నారు. కానీ ఎందుకో వారిలో మరో వైపు కొంత ఆందోళన కనిపిస్తోందిట. అందుకే ఎందుకొచ్చిన తంటా అనుకుంటూ గెలిచిన ఎమ్మెల్యేలని అలా తీసుకునిపోయి క్యాంప్ లకు తరలించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తోంది. గోవాకు కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తరలిస్తారు అని అంటున్నారు. అలా కాంగ్రెస్ తన జాగ్రత్తలో తాను ఉంటోంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే జేడీఎస్ కూడా తన పార్టీ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా కాపాడుకోవాలని చూస్తోంది. ఆ పార్టీకి అన్ని సర్వేలు పాతిక నుంచి ముప్పయి దాకా ఎమ్మెల్యేలను ఇచ్చాయి. రియల్ నంబర్ ఎంతో చూసుకుని గెలిచిన వారిని క్యాంప్ లకు తరలించే పనిలో జేడీఎస్ ఉందని అంటున్నారు. రేపటి రోజున హంగ్ అసెంబ్లీ వస్తే జేడీఎస్ మీదనే అన్ని పార్టీలు చూస్తాయని అంటున్నారు. అపుడు జేడీఎస్ తమ ఎమ్మెల్యేలను కాపాడుకుంటే కనుక కింగ్ అయ్యేందుకు చాన్స్ ఉంది. అందుకే జేడీఎస్ కూడా క్యాంప్ కి రెడీ అంటోంది. ఇక్కడ చూస్తే అధికారంలో ఉన్న బీజేపీకి ఆ పార్టీ పొలిటికల్ గేమ్స్ కే కాంగ్రెస్ జేడీఎస్ కలవరపడుతున్నాయని అంటున్నారు. 2018లో కేవలం 104 సీట్లు మాత్రమే తెచ్చుకున్న బీజేపీ మొత్తానికి ఏణ్ణర్ధం తిరగకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ఇపుడు కూడా బీజేపీ వంద సీట్లు కనుక సాధిస్తే తమ గేమ్స్ ఏంటో చూపిస్తుంది అని అంటున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ లో లుకలుకలు సీఎం సీటు కోసం కుమ్ములాటలు జేడీఎస్ లో ఉన్న నైరాశ్యం పెద్దగా దన్ను లేకపోవడం ఇవన్నీ కూడా బీజేపీ ప్లస్ చేసుకోవడానికి చూస్తుంది అన్న వార్తలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ జేడీఎస్ తమ ఎమ్మెల్యేలను కాపాడుకునే పనిలో పడ్డాయి. మొత్తానికి క్యాంప్ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ఇబ్బందికరమే అయినా వర్తమానంలో అవి తప్పడంలేదు అని అంటున్నారు.

# సంపాదకీయం

## మోడీ చేతికి చిక్కినట్టే చిక్కి జారిపోయిన కాంగ్రెస్ సీఎం..?

ప్రధాని నరేంద్ర మోడీ వ్యూహానికి చిక్కుకోని నేతలు అంటూ ఇటీవల కాలంలో పెద్దగా ఎవరూ కనిపించడం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వంటివారు కూడా మొదట్లో కొంత చిక్కినా.. తర్వాత.. వెనక్కు వచ్చారు. ఇప్పుడు పెద్ద యుద్ధమే చేస్తున్నారు. ఇదిలావుంటే.. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న రాజ స్థాన్లో మళ్లీ బీజేపీ సర్కారును కూర్చోబెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చాలా వ్యూహాత్మకంగానే అడుగు లు వేస్తున్నారు. అయితే.. అనుకున్న విధంగా అక్కడ బీజేపీ దూకుడు పెద్దగా కనిపించడం లేదు. దీంతో మోడీ.. కాంగ్రెస్ చిచ్చును తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే వాదన కొన్నాళ్లుగా వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత సీఎం కాంగ్రెస్ సీనియర్ నేత.. అశోక్ గెహ్లోట్ను బీజేపీ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు కొన్నాళ్లుగా చేస్తున్నారు. గెహ్లోట్ అడగగానే.. ప్రధాని అప్పాయింట్ మెంట్ ఇవ్వడం.. ఇటీవల రాజకీయంగా చర్చకు వచ్చింది. ఇక తాజాగా 5000 కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. పైగా.. సీఎంను ఆయన కొన్నాళ్లుగా పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. ఇదిలావుంటే.. కాంగ్రెస్లో అంతర్గత కుమ్ములాటలు తెరమీద కి తరచుగా వస్తున్నారు. సచిన్ పైలట్ వంటి వారు సీఎం సీటుపై ఆశలు పెట్టుకోవడం.. కాంగ్రెస్ మాత్రం ఆయనను పక్కన పెట్టడం.. వంటివి కాంగ్రెస్లో నిత్యకృత్యంగా మారాయి. ఈ క్రమంలో అశోక్ను తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేశారని.. జాతీయ మీడియా కూడా పెద్ద ఎత్తున కథనాలు రాసింది. అయితే.. అనూహ్యంగా సీఎం గెహ్లోట్.. ప్రధాని పాల్గొన్న సభలోనే.. ఆయనను విమర్శించారు. నిన్న మొన్నటి వరకు కేంద్రంపై పన్నెత్తు మాట అనని గెహ్లోట్.. తాజాగా మాత్రం ప్రధాని విపక్షాలను గౌరవించడం లేదని.. సభా ముఖంగానే విమర్శలు గుప్పించారు. దీంతో మోడీ వేసిన పాచిక పారలేదనే వాదన తెరమీ దికి వచ్చింది. మొత్తంగా చూస్తే.. అశోక్ వంటివారిని తమవైపు తిప్పుకోగలిగితే.. రాజస్థాన్లో పాగా వేయడం తేలికవుతుందనేది మోడీ వ్యూహం. మరి ముమ్ముందు ఏం జరుగుతుందో చూడాలి.

# చివరికి ఇంటికొచ్చేది బురదే..!





నిర్మల్ : ఈ చిత్రం తలమడుగు మండలం బరంపూర్‌లోని ఓ కాలనీలోనిది. భగీరథ పైపులైన్లు లీకేజీ కావడంతో.. నీరంతా వృథా అవుతోంది. దీంతో ఆ కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా వరకు పైప్‌లైన్లు సక్రమంగా లేక నీటి సరఫరా కావడం లేదు. దీంతో గ్రామంలోని పురాతన మంచినీటి ట్యాంకులే దిక్కవుతున్నాయి. ఇటీవల తీవ్ర ఇబ్బందులు ఎదురైన క్రమంలో పంచాయతీ పాలకవర్గం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించింది. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలోని చాలా కాలనీల్లో భగీరథ పైప్‌లైన్ల ఏర్పాటు అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో పైపులైన్లతో పాటు కుళాయి కనెక్షన్లు ఇంటింటికి ఇవ్వకుండా ఇష్టానుసారంగా వదిలేశారు. దీంతో శుద్ధ నీటి సరఫరా కావడం లేదు.

మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధ నీరు అందించాలనే ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇటీవల తలమడుగు మండల సర్వసభ్య సమావేశంలో అన్ని పంచాయతీల సర్పంచులు భగీరథ లీకేజీలపై భగ్గుమడమే సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. అసలే వర్షాకాలం.. పైపులైన్లకు లీకేజీలు ఏర్పడటంతో కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. జిల్లాలో మిషన్ భగీరథ పథకం కింద చేపట్టిన పైప్‌లైన్ల పనులపై సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరవైంది. తలమడుగు, గుడిహత్నూర్, తాంసి, బజార్‌హత్నూర్, బేల, జైనథ్, బోథ్ నేరడిగొండ, భీంపూర్, మావల, ఆదిలాబాద్ గ్రామీణం, ఇచ్చోడ, సిరికొండ తదితర మండలాల్లో వేసిన పైప్‌లైన్లు తరచూ లీకేజీలు అవుతుండటంతో.. నీటి సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. లీకేజీలతో నీరు కలుషితమవుతోంది. ఫలితంగా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. లీకేజీలతో పాటు చాలా గ్రామాల్లో రహదారి మధ్యలో పైప్‌లైన్ల కోసం తవ్వకాలు చేపట్టి తర్వాత ఆ మరమ్మతులు చేయని కారణంగా స్థానికులతో పాటు వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, మరోవైపు భగీరథ పనులను పర్యవేక్షించే అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాల్సి ఉన్నా.. అవేమీ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పత్తా లేని అధికారులు

గ్రామాల్లో పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టడంలో సంబంధితశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యను చరవాణుల ద్వారా వివరించినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమావేశాలకు తప్పితే కనీసం గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు కనిపించడం లేదు. లీకేజీలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్య పరిష్కారానికి కృషి : –వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, ఈఈజిల్లాలో నెలకొన్న మిషన్ భగీరథ లీకేజీల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. రెండు రోజుల్లో జిల్లాలోని ఆయా ప్రాంతాలకు సంబంధించి పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మరమ్మతులు చేపడుతాం. భగీరథ సమస్యలను సర్పంచులు మా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తాం.

# ప్రైవేటు బడులు.. పట్టించుకోవు నిబంధనలు



నిర్మల్ : నిర్మల్‌కు చెందిన ఒకరు ఓ ప్రైవేటు విద్యాలయంలో 4, 5 తరగతుల్లో తన ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. ఏడాదికి వీరికి ఫీజుల రూపంలో సుమారు రూ.52వేలు చెల్లిస్తున్నారు. ఇవి కాకుండా పాఠ్య, రాత పుస్తకాలు, ఏక రూప దుస్తులు, ఇతరత్రా వాటికి మరో రూ.25వేల వరకు అవుతోంది. దీంతో తీవ్ర ఆర్థిక భారమవుతోందని ఆందోళన చెందుతున్నారు. ఈ ఒక్కరే కాకుండా పలువురు తల్లిదండ్రులు, పోషకులు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్య ఇది. కొన్ని విద్యాలయాల వారు స్కూల్ ఫీజు కాకుండా, మిగితా స్టేషనరీని తప్పనిసరిగా తమ వద్దే కొనుగోలు చేయాలని, అప్పుడే తమ పిల్లలను పంపించాలంటూ నిబంధనలు విధిస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. జిల్లాలో 208 ప్రైవేటు విద్యాలయాలుండగా, 51,442 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాది కొత్తగా మరో రెండింటికి అనుమతులిచ్చారు. కరోనాతో రెండేళ్లుగా బడులు పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం.. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి రావడంతో కొందరు నిర్వాహకులు పెద్ద మొత్తంలోనే ప్రచారాల బాట పట్టారు. అనుమతులు తీసుకునే సమయంలో దరఖాస్తులో పెట్టిన పాఠశాల పేరునే బోర్డులపై రాయాల్సి ఉంటుంది. అయితే అవేమీ పట్టించుకోకుండా కొందరు ఆకర్షణీయమైన టెక్నో, ఈటెక్నో, పబ్లిక్, కాన్సెప్ట్, స్పేస్, మోడల్ అంటూ తదితరాలను జోడిస్తున్నారు. ఫీజుల వివరాలను విద్యాశాఖకు తెలియజేయాల్సి ఉండగా, వాటిని కొందరు పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయుల వివరాలు, విద్యార్హతలు వంటివి నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్ని చోట్ల వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా వాణిజ్య సముదాయాలు కలిగిన ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు.

తూతూమంత్రంగా..విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ఎంతో ముఖ్యం. అయితే మైదానాలు లేకుండానే కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు. అనుమతులు తీసుకునే సమయంలో మాత్రం ఆయా ప్రాంతాల్లో ఉన్న అనువైన మైదానం లేదా, సమీపంలోని పాఠశాల స్థలాన్ని లీజుకు తీసుకుంటున్నట్లు దస్త్రాలు సమర్పించి అనుమతులు పొందుతున్నారు. క్షేత్రస్థాయికి వచ్చే సరికి వారికి క్రీడలు కరవవుతున్నాయి. కొన్నిచోట్ల పాఠ్య, రాత పుస్తకాలు, స్టేషనరీ, ఏకరూప దుస్తులు వంటి తదితర వాటిని తమ వద్దే కొనుగోలు చేయాలని, సూచించిన ప్రాంతానికి వెళ్లాలని చెబుతూ తల్లిదండ్రులు, పోషకులపై ఆర్థిక భారం మోపుతున్నారు. జిల్లాలో సుమారు 280 బస్సులు వినియోగిస్తుండగా ఇందులో చాలా వాటిల్లో కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ఇటీవల పెంబి మండలంలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సు పిల్లలను ఇళ్ల వద్ద దించి తిరిగి వస్తున్న సమయంలో బ్రెకులు ఫెయిల్ అయి ప్రమాదానికి గురైన ఘటన సైతం చోటు చేసుకుంది. జి–ప్లస్ కలిగిన వాటిల్లో అగ్ని ప్రమాదాల నివారణ కోసం ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. వాటినీ పట్టించుకోవడం లేదు. ఇదంతా బాహాటంగా సాగుతున్నా.. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ సరైన దృష్టి సారించకపోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ విద్యాశాఖ సూచించిన నిబంధనలు తప్పక పాటించాలి. ఎవరైనా వీటిని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వెంటనే తనిఖీలు చేపట్టి నిర్వహణ తీరుపై పరిశీలన జరుపుతాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అపరాధ రుసుము విధిస్తాం. అవసరమైతే అనుమతి రద్దు చేస్తాం.

# సర్వర్ సమస్యలిక దూరం..!

నిర్మల్ : అంతర్జాల వినియోగం ఎప్పటికప్పుడు ఆధునికమవుతూ వడివడిగా 5జీ వైపు అడుగులేస్తోంది. నిత్యావసర సరకులు పంపిణీ చేసేందుకు ఏర్పాటుచేసిన రేషన్ దుకాణాల్లో మాత్రం ఇంకా 2జీ, 3జీ ఆధారిత పరికరాలనే వినియోగిస్తుండటంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా సంకేతాల సమస్య లబ్ధిదారులను అవస్థలకు గురిచేస్తోంది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆధునిక 4జీ అనుసంధానమైన ఈ–పోస్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలోని రేషన్ డీలర్లకు పంపిణీని ఇప్పటికే ప్రారంభించారు. జులై 1 నుంచి ఇవి అందుబాటులోకి రానున్నాయి.

తీరనున్న పడిగాపులు..2జీ, 3జీ సిమ్ వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించకపోయేది. సంకేతాలు సక్రమంగా అందకపోవడంతో సరకుల పంపిణీలో జాప్యం ఏర్పడేది. తాజా పరికరాలతో సమస్య దాదాపుగా దూరమవనుంది. జియో కంపెనీకి చెందిన 4జీ నెట్‌వర్క్‌తో పనిచేసే ఈ– పోస్ యంత్రాలను డీలర్లకు అందిస్తున్నారు. ఏదైనా సందర్భంలో సంకేతాలు రాకపోయినా, అక్కడ అందుబాటులో ఉండే ఇతర 4జీ, వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించుకోవచ్చు ఫలితంగా అంతర్జాల వినియోగంలో ఆటంకాలు తొలగిపోనున్నాయి.

డిజిటల్ లావాదేవీలు..రేషన్ దుకాణాల్లో టీ– వ్యాలెట్ సేవలు వినియోగించుకోవచ్చని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో అది అంతగా కనిపించడం లేదు. ప్రధానంగా నెట్‌వర్క్ సంబంధిత ఇబ్బందులే దీనిక్కారణం. తాజా నిర్ణయంతో ఈ సేవల్లోనూ నాణ్యత మెరుగవుతుంది. సరకుల పంపిణీతో పాటు ఇతర సేవలను సైతం టీ– వ్యాలెట్‌తో ప్రజలు వినియోగించుకోవచ్చు విద్యుత్తు, మొబైల్ బిల్లుల చెల్లింపు, రీఛార్జి, రైలు, బస్సు టికెట్ల రిజర్వేషన్, బ్యాంకు ఖాతాల్లో నగదు జమ, ఉపసంహరణ తదితర డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల వినియోగదారులకు సేవలు మరింత సులభమవుతాయి. అదే సమయంలో డీలర్లకు కమీషన్ సైతం పెరిగే అవకాశముంది.

# నీరు నిలిచి.. దోమలను పిలిచె..!

నిర్మల్ : జిల్లా రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. పట్టణ సరిహద్దు ప్రాంతాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లోని కాలనీ, గ్రామాల మధ్య ఖాళీ ప్లాట్లుతో ఇబ్బందులు తప్పడం లేదు. అవి అపరిశుభ్రతకు నిలయంగా, ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. వర్షాకాలంలో వరద.. మురుగునీరు చేరి దుర్వాసనకు తోడు దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయి. యజమానులు, పుర అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో గ్రామీణులు, ఉద్యోగులు ముందస్తుగా ఇళ్ల స్థలాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్లాట్ల ధరలు కొండెక్కుతుండటంతో పట్టణ సరిహద్దు గ్రామాల్లోని పలువురు స్థిరాస్తి వ్యాపారులు పంట పొలాలను కొనుగోలు చేసి, పంచాయతీ అధికారులు, పాలకవర్గం సభ్యులతో కుమ్మక్కై లేఅవుట్ లేకుండానే ప్లాట్లు చేస్తూ క్రయవిక్రయాలు చేపడుతున్నారు. ఏజెన్సీల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల అమ్మకాలు జరుపుతున్నారు. పలువురు ప్లాట్లను కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్లడం లేదు. నిర్వహణ లేక ఖాళీగా



వదిలివేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

బాధలు వర్ణనాతీతం

పురపాలక పరిధిలోని కాపువాడ, బాలాజీనగర్, ఆర్‌ఆర్‌ఓ కాలనీ, రైల్వేగేటు ఏరియా, పెట్రోల్‌పంపు, కృష్ణాకాలనీ, సర్‌సిల్క్ ఏరియా, విజయబస్తీ తదితర కాలనీల్లోనూ వందల సంఖ్యలో ఖాళీ స్థలాలు(ప్లాట్లు) ఉన్నాయి. యజమానులు చదును చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి, మురుగునీరు నిలిచి సమీపంలోని గృహాల వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం మొరం పోసుకొని చదును చేసుకుంటే నిల్వ నీటి సమస్య ఉండదని పలువురు భావిస్తున్నారు.

చర్యలు.. సర్వేలకే పరిమితం

నూతన పురపాలక చట్టం ప్రకారం ఖాళీ ప్లాట్లు స్థానికులకు ఇబ్బందిగా మారితే చర్యలు తీసుకోవాలి. అధికారులు సత్వరమే వాటిని గుర్తించి, సంబంధిత యజమానులకు శ్రీముఖాలను జారీ చేయాలి. గడువులోగా స్పందించకుంటే అధికారులే ఆ ప్లాటును అపరిశుభ్రతను తొలగించి, చదును చేయాలి. అందుకు ఎంత ఖర్చు అవుతుందో సదరు యజమాని నుంచి వసూలు చేయాలి. కానీ అధికారులు కేవలం సర్వేలకే పరిమితం అవుతున్నారు. కాగజ్‌నగర్ పురపాలక పరిధిలోని వివిధ వార్డులు, సరిహద్దు గ్రామాల్లో రెండు వందలకుపైనే ఖాళీ స్థలాలు(ప్లాట్లు)ను అధికారులు గుర్తించారు. ఇంకా ఎలాంటి నోటీసులు కూడా జారీ చేయకపోవడం గమనార్హం.

నోటీసులు జారీ చేస్తాం: రాజు, కమిషనర్

పట్టణంలోని వివిధ వార్డులోని ఖాళీ స్థలాలు, ప్లాట్లు సర్వేను పూర్తి చేశాం. త్వరలోనే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.

వర్షాకాలంలో రోగాల ముప్పు

పట్టణంలోని కాపువాడ, 6, 7 వార్డులతోపాటు ఆర్‌ఆర్‌ఓ కాలనీలోని ఎక్కువగా ఖాళీ స్థలాలున్నాయి. ప్లాట్లు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. కానీ నిర్మాణాలు లేక పిచ్చిమొక్కలు, మురుగునీరు నిలిచి సమీపంలోని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యజమానులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఆకతాయిలకు అడ్డాగా.. కాగజ్‌నగర్ మండలం చారిగాం, బోరిగాం ఏరియాలోని ఖాళీ ప్లాట్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదనీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. సమీపంలోని ఇంటి యజమానులు క్రిమికీటకాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలోని ఓ ఖాళీ ప్లాటు ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో మందుబాబులు ఆ ఖాళీ స్థలంలో మద్యం తాగి గొడవలకు పాల్పడుతున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాపువాడలోని పలు ఖాళీ ప్లాట్లలోని ఇదే పరిస్థితి నెలకొంది. శ్రీకృష్ణానగర్, బోరిగాం శివారులోని ఖాళీ ప్లాట్లలో బహిరంగంగా పేకాట ఆడుతూ.. మద్యం తాగుతున్నారు. పలుమార్లు బల్దియా, పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందన కరవైందని కాలనీవాసులు వాపోతున్నారు.

## పోడు రైతులకు అండగా ఉంటాం

ఆసిఫాబాద్ : పోడు రైతులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పేర్కొన్నారు. మండలంలోని రౌతసంకెపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల పోడు రైతులకు పట్టాలున్నా.. అటవీశాఖ అధికాలు అడ్డుకుంటున్నారన్న విషయాన్ని తెలుసుకొని పార్టీ శ్రేణులతో కలసి గ్రామాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. అడ్డఘాట్, బొందగూడ, మెంగుబాయిగూడ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల భూమిని మూడు తరాలుగా రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. హక్కు పత్రాలు, పట్టాలున్న భూములను సైతం అటవీ అధికారులు ఇవి కాదని.. మరోచోట ఉన్నాయంటూ రైతులను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. మూడేళ్లుగా ఈ భూమల చుట్టూ ట్రెంచ్‌లు తవ్వి సాగుకు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారి సమక్షంలో కొందరు రైతులు విత్తనాలు విత్తారు. విషయాన్ని తెలుసుకున్న రెబ్బెన, ఆసిఫాబాద్, గిన్నెధరి, తిర్యాణి రేంజ్‌ల నుంచి సుమారు 30 మంది అటవీశాఖ అధికారులు గ్రామానికి రావడంతో రైతులు అడ్డుకున్నారు. వీరికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు పలికారు. తమ భూములను లాక్కోవద్దంటూ రైతులు అటవీ అధికారులను వేడుకున్నారు. దీంతో కొంతసేపు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అటవీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది.

మించి ఉంటేనే స్వాధీనం

రెబ్బెన ఇన్‌చార్జీ ఎఫ్‌ఎస్‌వో శ్రీధర్‌చారి మాట్లాడుతూ.. పైలెట్ ప్రాజెక్టుగా అడ్డఘాట్‌ను ఎంచుకొని పూర్తి సర్వే చేశామన్నారు. రెవెన్యూ, అటవీ పట్టాలు కలిగిన సుమారు 60 మందికి 270–300 ఎకరాల వరకు అక్కడే చూపామన్నారు. పట్టాల్లో ఉన్న భూములకు మించి సాగు చేస్తున్న వాటినే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకు రెండేళ్ల క్రితం సదరు రైతులతో సమావేశం నిర్వహించి ఒప్పందం కూడా కదుర్చుకున్నామన్నారు. ఇక్కడి గిరిజనుల ఉపాధి కోసం వెదురు మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేసిన తరుణంలో మళ్లీ ఇలా జరగడం సరికాదన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ సోమవారం జిల్లా అటవీశాఖ అధికారితో మాట్లాడాక నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అక్కడి నుంచి వెనుదిరిగి పోయారు. డీఆర్‌వోలు ప్రవీణ్‌కుమార్, యోగేష్, ఎఫ్‌ఎస్‌వో రవి, ఇతర అటవీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం అధ్యక్షుడు గుండా శ్యాం, ఓయు ఐకాస సభ్యుడు అనీల్, జమీర్ తదితరులున్నారు.

# నిఘా కళ్లకు సుస్తీ..!

సూర్యాపేట : పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కిషన్‌రావు ఇంట్లో గత నెల 10న పట్టపగలు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చిన కొద్దిసేపట్లోనే గుర్తుతెలియని దొంగ బీరువాలోని తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేలను అపహరించాడు. స్థానిక సీసీ కెమెరాలను పరిశీలించగా అవి పనిచేయడం లేదని తేలడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన ఐదేళ్ల బాలికను వారం క్రితం ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత సమీపంలోని మూసీ కెనాల్ వద్ద అర తులం బంగారు చెవిదిద్దులు, ఆరు తులాల వెండి పట్టీలను తీసుకొని బాలికను వదిలి పరారయ్యారు. పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాను పరిశీలించేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది.
సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ధరావత్ నిఖిల్ ఎనిమిది నెలల క్రితం అనుమానాస్పదంగా చిలుకూరు మండలంలోని సాగర్ కాల్వలో శవమై తేలారు. స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు బయటకు వెళ్లిన నిఖిల్ జనగామ క్రాస్ రోడ్డులో సీసీ కెమెరాలో కనిపించారు. అక్కడి నుంచి జాతీయ రహదారి వైపునకు వెళ్లే మరో సీసీ కెమెరాను పరిశీలిస్తే



అది పనిచేయకపోవడంతో ఏం జరిగిందో పోలీసులు గుర్తించలేకపోయారు. సాగర్ కాల్వ వద్ద జాతీయ రహదారిపైనా అదే పరిస్థితి. ఈ కేసును ఛేదించడం సాధ్యం కాకపోవడంతో పోలీసులు సీబీసీఐడీకి అప్పగించాల్సి వచ్చింది.
జిల్లాలో సీసీ కెమెరాల పనితీరు అధ్వానంగా తయారైంది. మరోవైపు రోజురోజుకూ నేరాల సంఖ్య పెరిగిపోతుండటం, దర్యాప్తులో కీలకమైన సమయాల్లో ఇవి పనిచేయకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. నేరాల నియంత్రణ, కేసుల దర్యాపు సమయంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని పోలీసు ఉన్నతాధికారులు అన్ని ఠాణాల పరిధిలో ముమ్మరంగా ఏర్పాటుచేయించారు. జిల్లాలో మొత్తం 1200కుపైగా కెమెరాలుండగా.. అందులో సగానికిపైగా పనిచేయడం లేదని సమాచారం. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 300 నిఘా కళ్లకు గాను కేవలం 120 మాత్రమే పనిచేస్తున్నాయంటే వాటి నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**సిబ్బంది లేరు.. ప్రత్యేక నిధులు లేవు**

జిల్లాలోని సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు సాంకేతిక నిపుణులు, నిర్వహణకు ప్రత్యేక నిధులూ అందుబాటులో లేవు. దీంతో పోలీసులు స్థానికంగా దాతల సహకారంతో కూడళ్లలో, మలుపు ప్రాంతాల్లో ఏర్పాటు చేయిస్తున్నారు. చిన్నపాటి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసిన సమయాల్లో ఇవి మరమ్మతుకు గురవుతున్నాయి. వీటి పనితీరును కొంత మంది సిబ్బంది పర్యవేక్షించాల్సి వస్తోంది. కొన్ని ఠాణాల్లో పోలీసులు సొంత డబ్బులు వెచ్చించి స్థానిక నిపుణులతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం సాంకేతిక సిబ్బందితోపాటు నిర్వహణకు నిధులు కేటాయిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

**మరమ్మతులు చేయిస్తున్నాం– నాగభూషణం, డీఎస్పీ, సూర్యాపేట**

అకాల వర్షాలు, ఈదురు గాలులకు సీసీ కెమెరాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటి వరకు పట్టణంలో 120 సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించాం. త్వరలోనే మిగిలినవి పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

# ఇసుక తవ్వేస్తున్నా.. వారి దృష్టికి రాలేదంట

నిజామాబాద్ : గోదావరి, మంజీరా నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా యంత్రాలతో తవ్వుతున్నారు. ట్రాక్టర్లలో కిలోమీటర్ దూరంలో ఉన్న ఒడ్డు వరకు తీసుకొచ్చి డంపులుగా పోస్తున్నారు. ఇలా వందల కొద్దీ ట్రాక్టర్లతో పోసిన కుప్పలు కనిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి టిప్పర్లలో తరలించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. నిత్యం ఇదే అక్రమ తంతు జరుగుతున్నా రెవెన్యూ, గనులశాఖ, పోలీసులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించటం గమనార్హం.

**ఈ ప్రాంతాల్లోనే..**

వంతెనకు ఎడమవైపు మంజీరాలో, మొఘల్‌పురా శివారులో వంతెన కింది భాగంలో యంత్రాలతో తోడుతున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తీసుకెళ్లి డంపులు చేస్తున్నారు. ఇంత బహిరంగంగా జరగటాన్ని చూస్తుంటే.. అనుమతి తీసుకొని చేస్తున్నారేమో అనిపిస్తుంది. కానీ ఇక్కడ జరుగుతోంది పూర్తిగా అక్రమ ఇసుక తవ్వకాలే. అయినా ఎవరు అడ్డు చెప్పకపోవటం ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్న పలువురు ఈ దందాలో భాగస్వామ్యం కావడం వల్లే అధికారులు మౌనంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

**కట్టడి చేయరా?**

ఇసుక తవ్వకాలు జరపాలన్నా, వాహనాల్లో తరలించాలన్నా రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వాలి. ఏదైనా అవసరానికి తీసుకెళ్లాలన్నా టోకెన్లు జారీ చేస్తారు. కందకుర్తిలో అలాంటిదేమీ జరగటం లేదు. ఇష్టానుసారంగా ఎవరికి తోచిన విధంగా వారు ఇసుకను తోడుకొని వెళ్తున్నారు. వందల కొద్దీ ట్రాక్టర్ల ఇసుక డంపులుగా పోసి.. టిప్పర్లలో తరలించి విక్రయిస్తున్నారు. కట్టడి చేయాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకుంటాం..– రాంచందర్, తహసీల్దార్, రెంజల్**

కందకుర్తి వద్ద గోదావరి, మంజీర తీరాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టిలో లేదు. ఇక్కడ ఎవరికి అనుమతి ఇవ్వలేదు. పరిశీలించి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

**తనిఖీలు చేస్తాం– సత్యనారాయణ, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్**

ఇసుక తవ్వకాలకు సంబంధించి అనుమతులు రెవెన్యూశాఖ వారే ఇస్తారు. అయితే అక్రమ రవాణాను నియంత్రించడానికి మాశాఖ సిబ్బంది తనిఖీలు చేస్తారు. కందకుర్తి వద్ద డంపులు పోసి ఇతర ప్రాంతాల్లోకి తరలించి విక్రయిస్తున్నట్లు మాకు సమాచారం లేదు. వెంటనే తనిఖీలు చేపట్టి ఆ వాహనాలను సీజ్ చేస్తాం.

# పురంలో.. పన్నుల మోత



సూర్యాపేట : సూర్యాపేట పరిధిలోని బీబీగూడెం పురపాలికలో విలీనమైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి గతంలో రూ.1000 ఇంటి పన్ను వచ్చేది. భువన్ సర్వే చేయడంతో మూడింతలు పెరిగింది. ఈ విషయమై సర్వే అధికారులను అడుగగా.. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలానికి కూడా పన్ను వచ్చిందని చెప్పడంతో అవాక్కయ్యారు. భువన్ సర్వేతో పురపాలికల్లో పన్నుల మోత మోగుతోంది. కొత్త పురపాలక చట్టం 2019 ప్రకారం ఆస్తి పన్నులు నమోదు చేయడంతో పన్నుదారులు లబోదిబోమంటున్నారు. గత ఏడాదిగా భువన్ సర్వే నమోదు ఆన్‌లైన్‌లో వేగవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటిని అమల్లోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు కేవలం ఇంటి నిర్మాణం కొలతల ఆధారంగా మాత్రమే పన్నులు విధించి వసూలు చేసిన ప్రభుత్వం.. తాజాగా ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలానికి కూడా పన్ను విధించే విధానాన్ని కొత్త సాఫ్ట్‌వేర్‌లో రూపొందించింది. దీంతో మూడింతల భారం పడనుందని పన్నుదారులు వాపోతున్నారు. మరోవైపు ఆస్తి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నమోదైన విలువ ఆధారంగా వీటి విలువను పరిగణనలోకి తీసుకోవడంతో పన్నుల విలువ మరింత పెరిగిపోయింది. ఇలా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో వార్డులోని ఇంటిని నమోదు చేస్తే చాలు పన్నులు ఎంత మొత్తం వసూలు చేయాలో అదే లెక్కగడుతోంది.

**తాత్కాలిక సిబ్బందితో సర్వే**

పురపాలక శాఖ ఆదేశాలతో 2020లో మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇస్రో భువన్ సర్వేను తాత్కాలిక సిబ్బందితో నమోదు చేయించింది. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు కొంత నగదు ముట్టజెప్పి వారితో సర్వే చేయించి వివరాలు నమోదు చేయించారు. వారికి అవగాహన లేకపోవడంతో హడావుడిగా కొలతలు తీశారనే ఆరోపణలున్నాయి. ఇళ్లకు తాళాలు వేసి ఉన్నా.. తప్పుల తడకగా వివరాలు నమోదు చేశారనే విమర్శలున్నాయి. దీంతో పన్నులు తడిసిమోపెడయ్యాయి. గృహనివాస ఆస్తులకు ఒక మొత్తాన్ని.. వాణిజ్య సముదాయాల వాటికి రెట్టింపుగా పన్నుల విధించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ విధానాన్ని రద్దు చేసి మరోసారి ఆస్తి కొలతల్ని లెక్కించాలన్న డిమాండ్ పన్నుదారుల నుంచి వినిపిస్తోంది.

**విలీన గ్రామాలపై ప్రభావం**

పురపాలికల్లో విలీనమైన గ్రామాల్లో భువన్ ప్రభావం మరింత పడింది. పురపాలిక పరిధిలోకి వచ్చినా సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కువగా నిరుపేదలు ఉన్నా రిజిస్ట్రేషన్ కార్యాలయం నమోదు చేసిన విలువ ప్రకారమే పన్నులు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే ఇంటి నిర్మాణానికి పడుతున్న ఇబ్బందులకు తోడు పన్నుల బాదుడుపై ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలంలో చిన్న గుడిసె ఉన్నా మొత్తం స్థలానికి పన్ను చెల్లించాల్సి ఉండటంతో నిరుపేదల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు 75 చదరపు అడుగుల లోపు నిర్మాణానికి కేవలం రూ.100 మాత్రమే పన్నులు వసూలు చేయాల్సి ఉన్నా ఆవరణలోని ఇతర స్థలానికి పన్నులు విధించనున్నారు. ఆస్తుల వివరాలు తప్పుగా నమోదై ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి సరి చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

# నీలగిరి నడిబొడ్డున ప్రభుత్వ స్థలం కబ్జా



సూర్యాపేట : విలువ అక్షరాల రూ.ఒక కోటికి పైగానే.. దీంతో కొందరు కబ్జారాయుళ్ల కన్ను దానిపై పడింది.. నయానో.. భయానో అధికారులను మెప్పించి రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలకు బరి తెగించారు. ఈ తతంగం ఏదో మారుమూల ప్రాంతంలో కాదు.. నల్గొండ నడిబొడ్డున గడియారం కేంద్రంలో జరుగుతోంది. నియంత్రించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోంది. ముందుగా చిన్నపాటి డబ్బాకొట్టు ఏర్పాటు చేసుకుని దాని వెనుక భాగంలో అధికారుల కళ్లు కప్పి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. జీవో 58 ఆసరాగా చేసుకుని క్రమబద్ధీకరణకు సైతం దరఖాస్తులు చేసుకునే ప్రయత్నాలు జరుపుతున్నట్లు సమాచారం.

**కళాభారతి స్థలానికి ఎసరు..!**

హైదరాబాద్ రవీంద్రభారతి మాదిరిగా నల్గొండ ప్రజలకు ఆధునిక హంగులతో కళాభారతి నిర్మించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కళాభారతి భవన నిర్మాణానికి నల్గొండ నడిబొడ్డున ఉన్న ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించి అ స్థలంలో నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రతిపాదించగా ప్రభుత్వం ఆమోదించింది. దీంతో రెండు శాఖల కార్యాలయాలను మున్సిపాలిటీ భవనాల్లోకి మార్చారు. త్వరలోనే కళాభారతి నిర్మాణానికి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా..మరో పక్క కబ్జాదారులు ఆ స్థలంపై కన్నేశారు. ఎస్‌బీఐకి ఆనుకుని కొంత మేర స్థలాన్ని ఆక్రమించారు.

**అందరూ ప్రేక్షకులే..**

జిల్లా కేంద్రంలో గడియారం కేంద్రం నుంచి రామగిరి వెళ్లే మార్గంలో ఎస్‌బీఐ పక్కన ఆర్అండ్‌బీ స్థలంలో ఏడాది క్రితం ముందుగా ఒక చిన్న డబ్బా ఏర్పాటు చేసి అందులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. దానిని తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఇటీవల ఆక్రమణదారులు ప్రజల, అధికారుల కళ్లు కప్పి కళాభారతి స్థలంలో జాతీయరహదారి 565 నుంచి కళాభారతికి కేటాయించిన స్థలంలో ఉన్న ఆలయం వరకు గ్రీన్‌షెడ్లు ఏర్పాటు చేసి చడీచప్పుడు కాకుండా రాత్రి సమయంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. అయితే ఈ ఆక్రమణ వెనుక ఆధార్‌కేంద్రం నిర్వాహకులను ముందు ఉంచి బడా రాజకీయ నాయకులు తెర వెనుక ఉండి కథ నడిపిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను తొలగించి, స్థలాన్ని రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

**అక్రమ నిర్మాణాలు కూల్చివేత**

నల్గొండ జిల్లాకేంద్రం నడిబొడ్డున కళాభారతికి కేటాయించిన స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను పుర అధికారులు యంత్రాల సహాయంతో శనివారం కూల్చివేశారు. కళాభారతి నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ, నీటిపారుదల శాఖ కార్యాలయాలను మరో చోటకు తరలించి అ స్థలాన్ని కళాభారతికి ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. ఆ స్థలంలో ఇటీవల కబ్జాదారులు కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇదే విషయంపై పుర కమిషనర్ రమణాచారిని వివరణ కోరగానే ఆయన వెంటనే స్పందించారు. అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తక్షణమే కళాభారతి స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

**తక్షణమే తొలగిస్తాం**
**రమణాచారి, కమిషనర్**

కళాభారతికి కేటాయించిన స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే పరిశీలించి తక్షణమే వాటిని కూల్చి వేస్తాం. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

# బడి బస్సు పొగ.. అనారోగ్యం పాగా

మిర్యాలగూడ : కేరింతలు కొడుతూ.. ఆనందంగా పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు డీజిల్‌తో నడిచే బస్సుల నుంచి వచ్చే పొగతో అనారోగ్యం పాలవుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కెనడాకు చెందిన 'కెనడియన్ పార్టనర్‌షిప్ ఫర్ చిల్డ్రన్స్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీపీహెచ్‌ఈ)'.. బడి బస్సులు– చిన్నారుల ఆరోగ్యం అంశంపై ప్రత్యేక అధ్యయన నివేదికను ఇటీవలే విడుదల చేసింది. నివేదికలో బస్సుల నుంచి వెలువడే డీజిల్ ఉద్గారాలతో పిల్లల్లో ఏర్పడుతున్న అనారోగ్య సమస్యలతో పాటు పర్యావరణం, విద్యుత్తు వాహనాల వినియోగం అంశాలను విశ్లేషించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,560 బడి బస్సులు ఉండగా.. వాటిలో ప్రయాణిస్తూ నిత్యం వేలాది మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్నారు.

**పిల్లల్లోనే అధిక సమస్యలు..**

వాయు కాలుష్యంతో పెద్దలకంటే పిల్లల్లోనే అధిక సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని బడి బస్సులన్నీ డీజిల్‌తో నడిచేవే. వీటి నుంచి వెలువడే పొగ, ఉద్గారాలతో విద్యార్థుల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా ఎదిగే పిల్లల్లో ఊపిరితిత్తులు సైతం పరిమాణం పెరుగుతూ ఉంటాయి. ఈ సమయంలో వారు గాలి ఎక్కువగా తీసుకుంటారు. అది కలుషితమై ఉండడం వల్ల.. ఊపిరితిత్తులు, గుండె పని తీరుతో పాటు మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీపీహెచ్‌ఈ నివేదిక తెలుపుతోంది. దీంతో పిల్లలు శారీరక, మానసిక అనారోగ్యానికి గురవడంతో పాటు హార్మోన్లపై ప్రభావం చూపుతూ..పునరుత్పత్తి సామర్థ్యం సైతం తగ్గుతోంది. దీంతో పాటు బస్సుల నుంచి వచ్చే శబ్ద కాలుష్యంతో డిప్రెషన్, క్యాన్సర్, యాంగ్జయిటీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

**విద్యుత్తు బస్సులే మేలు..**

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు.. పర్యావరణానికి మేలు చేసేందుకు కాలుష్య రహిత విద్యుత్తు ఆధారిత వాహనాల వాడకమే మేలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్తు వాహనాల్లోని బ్యాటరీలను తరచూ ఛార్జింగ్ చేస్తుండాలి. దీంతో సమయం వృథా అవుతుంది. దీన్ని అధిగమించడంతో పాటు పర్యావరణ హిత వాహనాల తయారీ కోసం ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్నాయి. బస్సులపై సోలార్ ప్యానెల్స్ అమర్చడం ద్వారా..బ్యాటరీలో ప్రయాణంలోనే ఛార్జింగ్ చేసుకునేలా పరిశోధనలు సాగుతున్నాయి.

# గుత్తేదారుల్లో నిస్తేజం.. పనుల్లో జాప్యం

సూర్యాపేట : ఒకటోసారి.. రెండోసారి..మూడోసారి.. నాల్గోసారి.. ఇది వేలంపాట కాదు. సాగర్ ఎడమ కాల్వ పనులకు టెండర్లు వేసిన తీరు. నాలుగు సార్లు టెండర్ వేసినా ఒక్క గుత్తేదారుడూ ముందుకు రాలేదు. ఎన్నెస్పీ పనులంటేనే గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. పెద్ద కంపెనీలు ఒకటి రెండు టెండర్లు వేసినా పనులు చేయడంలో, అగ్రిమెంట్ చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. ఇందుకు నిదర్శనం సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని వంతెనల నిర్మాణాలు, లైనింగ్ పనులు.

**ప్రారంభం కాని పనులు..**

సాగర్ ఎడమ కాల్వపై గరిడేపల్లి మండలం మర్రికుంట, కుతుబ్‌షాపురం వద్ద ఉన్న వంతెనల, రామాపురం, కరక్కాయలగూడెం కాల్వలపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గతేడాది జనవరి ఆరున మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. కాల్వ పనులతో పాటు లైనింగ్, ఎత్తిపోతల పథకాలకు, ఇతర శాఖల పనులకు సైతం అదే రోజు శంకుస్థాపనలు హుజూర్‌నగర్‌లో చేశారు.



మర్రికుంట వంతెనకు రూ.1.93 కోట్లు, కుతుబ్‌షాపురం వంతెనకు రూ.1.36 కోట్లు, ముక్త్యాల బ్రాంచి కాల్వకు రూ.184.60 కోట్లు, జాన్‌పహాడ్ బ్రాంచి కాల్వకు రూ.52.11 కోట్లు, సాగర్ ఎడమ కాల్వ లైనింగ్ పనులకు రూ.29.02 కోట్లు, జాన్‌పహాడ్ మేజర్‌పై ఎత్తిపోతల పథకానికి రూ.173 కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన పనులకు టెండర్ పిలువగా.. సాగర్ కాల్వపై ఉన్న మర్రికుంట వంతెనకు మినహా మిగతా పనులకు గుత్తేదారులు టెండర్ దాఖలు చేశారు. జనవరి 2022లో శంకుస్థాపన చేయగా లైనింగ్ పనులకు మేలో టెండర్ అగ్రిమెంట్ పూర్తయింది. రామాపురం వంతెనకు గత నెలలో, కరక్కాయల గూడెం వంతెనకు రెండు రోజుల క్రితం అగ్రిమెంట్ పూర్తయింది. ప్రధాన కాల్వ, ముక్త్యాల, జాన్‌పహాడ్ బ్రాంచి కాల్వల లైనింగ్, ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయడానికి 18 నెలల (నవంబర్ 2023 వరకు) గడువు విధించారు. ఈ పనులన్నింటినీ 'మెగా' కంపెనీ చేపట్టింది. ముక్త్యాల బ్రాంచి కాల్వ పనులు, ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించగా ప్రధాన కాల్వ లైనింగ్ పనులు, జాన్‌పహాడ్ బ్రాంచి కాల్వ లైనింగ్ పనులు నేటికీ మొదలు పెట్టలేదు.

**మర్రికుంట వంతెన..**

సూర్యాపేట–గరిడేపల్లి రహదారిలో సాగర్ ఎడమ కాల్వ పైన ఈ వంతెన నిర్మించాల్సి ఉంది. ఇరుకు వంతెన సమస్యను గుర్తించి అత్యవసరమైన మర్రికుంట, కుతుబ్‌షాపురం వంతెనలకు నిధులు మంజూరు చేశారు. మర్రికుంట వంతెన నిర్మాణానికి గతంలో మూడు సార్లు టెండర్ పిలిచినా ఎవరూ ముందుకురాలేదు. దాంతో నాల్గోసారి టెండర్ పిలిచారు. అదీ (8వ తేదీ) సోమవారం వరకు గడువు ఉంది. ఈసారి టెండర్ ఎవరూ వేయకుంటే ఈ ఏడాది పనులకు మోక్షం లేనట్లే. కుతుబ్‌షాపురం వంతెనకు నిధులు మంజూరయ్యే సమయంలో జీఎస్టీ 12 శాతం ఉండగా కొద్ది రోజులకే 18 శాతానికి పెంచారు. మరోసారి అంచనాలు మార్చి అదనపు నిధుల మంజూరుకి పంపారు. అవి వచ్చే సరికి ఆలస్యం కావచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

**మూడు నెలలే సమయం**

సాగర్ కాల్వలపై చేపట్టే పనులకు వేసవిలో మూడు నెలలే సమయం ఉంటుంది. మే, జూన్, జులై నెలల్లోనే పనులు వేగవంతంగా జరుగుతాయి. ఆగస్టులో ఎగువ జలాశయాలకు వరద వస్తే నీటి విడుదల ముందుగానే ఉంటుంది. గత నాలుగు సంవత్సరాల్లో నీటి విడుదల ఆగస్టు మొదటి, రెండో వారంలోనే జరిగింది. ఏప్రిల్ 20 నాటికి నీటి విడుదల నిలిపివేయడంతో పనులు చేపట్టడానికి ఏప్రిల్ చివరి నుంచి సమయం దొరుకుతుంది. అగ్రిమెంట్ పూర్తయిన పనులకు సైతం మెటీరియల్, యంత్రాలు చేర్చుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఇసుక, కంకర తరలించడానికి 15 రోజులు పడుతుందని గుత్తేదారులు పేర్కొంటున్నారు.

# వరద ముప్పు.. మరమ్మతులతోనే తప్పు

కామారెడ్డి : జిల్లాకేంద్రంలో వరదనీటి కాల్వలు అక్కడక్కడ కొట్టుకుపోయాయి. పది కాలాలపాటు మన్నాల్సిన నిర్మాణాలు అనతికాలంలోనే అధ్వానంగా మారాయి. గతేడాది కురిసిన వానలకు కాల్వలకు పగుళ్లు తేలాయి. సిమెంట్, కాంక్రిట్ ధ్వంసమై వరద తాకిడికి కాల్వ ప్రహరీలు ధ్వంసమయ్యాయి. పనుల నాణ్యత ప్రశ్నార్థకమైంది. రూ.16.85 కోట్లతో చేపట్టిన పనుల్లో ఏటా డొల్లతనం బయటపడుతోంది.

**భవిష్యత్తు అవసరాల దృష్ట్యా..**

2040 సంవత్సరం వరకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా 10 కి.మీ మేర వరదనీటి కాల్వలు నిర్మించారు. వరద నీరు రోడ్లపైకి చేరకుండా కొత్త పట్టణం నుంచి పాతపట్టణం వైపు కాల్వలు ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్, రుక్మిణికుంట, పంచముఖి హనుమాన్‌కాలనీ, బతుకమ్మకుంట, ఉపాధ్యాయకాలనీ, గాంధీనగర్, వాసవీనగర్ మీదుగా సిరిసిల్లరోడ్డులోని నాలాలోకి వరద నీరు వెళ్లేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఏటా పెద్ద ఎత్తున వరద నీరు కాల్వల్లోకి వస్తుండటంతో తాకిడి తట్టుకోలేక పగుళ్లుబారి ధ్వంసమవుతున్నాయి.

**క్షేత్రస్థాయిలో సర్వే చేస్తేనే..**

జిల్లాకేంద్రంలో క్షేత్రస్థాయిలో వరదనీటి కాల్వలపై పురపాలక అధికారులు సర్వే చేపట్టి ఎక్కడెక్కడ ధ్వంసమయ్యాయో వివరాలు సేకరించాలని ప్రజలు కోరుతున్నారు. జూన్ మొదటివారం వరకు ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడితే ప్రయోజకరంగా ఉంటుంది. వరదనీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అనుమతి లేకుండానే అమ్మకాలు..!

మహబూబాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు, హోటళ్లు, దాబాలు కొనసాగుతున్నాయి. విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ఆహారభద్రత అనుమతులు లేకుండానే అమ్మకాలు చేస్తున్నారు. అధికారులు అడపాదడపా తనిఖీలతో మమ అనిపిస్తున్నారు. ఇన్‌ఛార్జి అధికారులు బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇటీవల తొర్రూరు, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి పలువురు ఫిర్యాదులు చేయడంతో.. ఆ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అనుమతులు తప్పనిసరంటూ.. పలువురికి నోటీసులు జారీ చేశారు.

అవగాహన కల్పిస్తున్నా..

ఆహార భద్రత అధికారులు తనిఖీలకు వెళ్లినప్పుడు అనుమతులు తీసుకునే విధానంపై నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరినీ ఆశ్రయించకుండా ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ నంబరును పొందొచ్చని సూచిస్తున్నారు. గడువు దాటిన వారు కూడా వెంటనే



పునరుద్ధరించుకోవాలని, లేదంటే రోజుకు రూ.100 చొప్పున జరిమానా పడుతుందని వివరిస్తున్నారు. అయినప్పటికీ.. చాలా మంది అనుమతులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

అనుమతులకు వెనకడుగు

దుకాణాలు, హోటళ్లు, మిల్లులు, బేకరీలు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, దాబాలు, రెస్టారెంట్లు, వాటర్ ప్లాంట్లు, నూనె మిల్లుల నిర్వహణ తదితర వ్యాపారాలు చేసేవారు పట్టణాల్లో మున్సిపాలిటీ, పల్లెల్లో పంచాయతీతో పాటు ఆహార భద్రత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఎక్కువ శాతం వ్యాపారులు మున్సిపాలిటీ, పంచాయతీ నుంచి లైసెన్సులు పొందుతున్నారు. ఆహారభద్రత అధికారుల నుంచి అనుమతులకు వెనకడుగు వేస్తున్నారు. అవగాహన ఉన్న వారు మాత్రమే రెండు శాఖల నుంచి అనుమతులు తీసుకొని వ్యాపారం చేస్తున్నారు. మార్కెట్లో మంచి పేరున్న హోటళ్ల నిర్వాహకులు కూడా ఆహార భద్రత లైసెన్స్ లేకుండానే నిర్వహణ చేస్తున్నట్లు ఇటీవల తనిఖీల్లో అధికారులు గుర్తించారు.

ఇవీ సంఘటనలు ఇటీవల తొర్రూరు పరిధిలో నాణ్యతాప్రమాణాలు పాటించకుండా నూనె విక్రయాలు చేస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు రావడంతో.. వారు అక్కడికి వెళ్లి నమూనాలు సేకరించి నాణ్యత లేదని నిర్ధారించారు. నిర్వాహకుడికి సుమారు రూ.లక్ష జరిమానా విధించేందుకు నోటీసు సిద్ధం చేస్తున్నారు.గత నెలలో మహబూబాబాద్‌లో అల్లంవెల్లుల్లిలో కల్తీ జరిగినట్లు ఫిర్యాదు రావడంతో.. దాని నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కల్తీ ఉందని గుర్తించారు. తాజాగా గురువారం తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో పురపాలకశాఖ, ఆహారభద్రత నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పలు దుకాణాలు, బిర్యానీ సెంటర్లను మున్సిపల్ శాఖ అధికారులు సీజ్ చేశారు.

నోటీసులు ఇస్తున్నాం..

తనిఖీల సమయంలో అనుమతులు లేకపోతే కేసులు నమోదు చేస్తున్నాం. అనుమతులు లేని వ్యాపార సముదాయాల నిర్వాహకులందరూ వెంటనే ఆన్‌లైన్ విధానంలో అనుమతులు తీసుకోవాలని నోటీసులు జారీ చేశాం. యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం.
అమృతశ్రీ, ఉమ్మడి జిల్లా ఆహారభద్రత అధికారి

# క్రమబద్ధీకరణకు అడుగులు

సిరిసిల్ల : జిల్లాలో 2019 నవంబరు, డిసెంబరు నెలల్లో లేఅవుట్ల రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కు 42,524 దరఖాస్తులు వచ్చాయి. తర్వాత ప్రతిపక్షాల ఆందోళనతో తదుపరి ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ మౌఖిక ఆదేశాలతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. వీటిని క్రమబద్ధీకరించడం ద్వారా రెండు పురపాలికలకు రూ.30 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని అంచనా. పంచాయతీల్లోని లేఅవుట్లపై ఇప్పటికీ ఎలాంటి ఆదేశాలు అందలేదు.

క్షేత్రస్థాయికి అధికారులు

జిల్లాలో 42,524 దరఖాస్తులు వచ్చినప్పటికీ అందులో సిరిసిల్ల, వేములవాడ పురపాలికల పరిధిలోని 26,524 మాత్రమే ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. వీటిలో ఇప్పటికే కొన్నిచోట్ల సర్‌ఛార్జి చెల్లించేసి భవన నిర్మాణ అనుమతులు పొందినట్లు తెలుస్తోంది. రెండు పురపాలికల్లో కొత్త మాస్టర్‌ప్లాన్ నిబంధనలు, జోన్లు, ఎఫ్‌టీఎల్ నిబంధనలు, వివాదస్పదమైన దరఖాస్తులను పక్కన పెడుతున్నారు. రెండు పురపాలికల్లో 67 వార్డుల్లో రెవెన్యూ సర్వే నంబర్ల ఆధారంగా దరఖాస్తుల పరిశీలిస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అర్జీల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిగా అంతర్జాలంలోనే జరుగుతుంది. ఇప్పటికే జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. దరఖాస్తుదారులకు ఫోన్ చేసి క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉంటే ఫీజు తీసుకుంటారు. చివరగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ ఇచ్చేలా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ప్రక్రియ కొనసాగుతోందిలా..రెవెన్యూ దస్త్రాల్లోని సర్వే నంబర్ల ఆధారంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. నిబంధనల ప్రకారం ఉంటే క్రమబద్ధీకరిస్తారు. లేకుంటే తిరస్కరిస్తారు.

అర్హత పొందిన స్థల యజమానికి చరవాణికి సమాచారం వెళ్తుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా క్రమబద్ధీకరణకు రుసుము చెల్లించాలి.

రిజిస్ట్రేషన్‌శాఖ ఖరారు చేసిన మార్కెటు విలువ ప్రకారం ఫీజులు ఉంటాయి. ఉదాహరణకు 200–300 గజాల స్థలానికి సుమారు రూ.1.50 లక్షల వరకు రుసుములుంటాయని అంచనా వేస్తున్నారు.

ఇప్పటికే రెండు పట్టణాల్లో కొన్ని లేఅవుట్లలో సర్‌ఛార్జి చెల్లించి భవన నిర్మాణ అనుమతులు పొందినట్లు తెలుస్తోంది.

సిరిసిల్ల, వేములవాడలో కొత్త మాస్టర్ ప్లాన్ నిబంధనల ప్రకారం. జోన్లు, ఎఫ్‌టీఎల్ నిబంధనలు, వివాదస్పద స్థలాల దరఖాస్తులను పక్కన పెడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో..– అన్సారీ, డీటీసీపీ

ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం రెండు పట్టణాల్లో మాత్రమే ప్రక్రియ జరుగుతోంది. గ్రామాలకు ఆదేశాలు అందలేదు. ఈ ప్రక్రియ పూర్తయితే రెండు పట్టణాలకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

# 92 మంది ఉపాధ్యాయ డిప్యూటేషన్ల రద్దు



భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ డీడీ ఆధ్వర్యంలో అన్ని రకాల డిప్యుటేషన్ల రద్దు ప్రక్రియ కొనసాగుతోంది. డిప్యుటేషన్ల వ్యవహారంలో వరుస కథనాలు రావడంతో పీవో గౌతమ్ ఆదేశాలతో డీడీ రమాదేవి స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అన్ని క్యాడర్లకు చెందిన 92 మంది ఉపాధ్యాయులను సొంత గూటికి పంపించారు. వాస్తవ పోస్టుల్లోకి వెళ్లాలని డీడీ ఆదేశించారు.

విభాగాల నిర్వాహకులు ఇక్కడే..

విభాగాల నిర్వహణకు ఇబ్బంది ఉండకుండా వీటి అధిపతులను యథాతథంగా ఉంచారు. పీఎమ్మార్సీ అకడమిక్ కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి, గర్ల్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి, మ్యూజియం కోఆర్డినేటర్, బాలభటుల విభాగం వంటి చోట్ల ప్రధాన నిర్వహకులు డిప్యుటేషన్‌లో ఉన్నప్పటికీ వారిని ఇదే హోదాలో కొనసాగించాలని నిర్ణయించారు. అనారోగ్య కారణాలతో ఇంకొందర్ని ఎటూ కదిలించ లేదు. ఇలాంటి వారు మొత్తంగా 38 మంది ఉన్నారు. ప్రస్తుతానికి వీరి డిప్యుటేషన్ అమల్లో ఉన్నప్పటికీ ఇది తాత్కాలికమేనన్న సంకేతాలు ఉన్నాయి.కౌన్సెలింగ్‌కే మొగ్గు..

మిగతా విభాగాల తరహాలో క్రీడాధికారి ఇక్కడే ఉంటారని భావించారు. ఉన్నతాధికారులు మాత్రం ఆయనను కిన్నెరసాని క్రీడా పాఠశాలలోని సొంత పోస్టుకు పంపారు. పీఎమ్మార్సీలో ఏసీఎంవో తర్వాత అసిస్టెంట్ ఏసీఎంవో ఉన్నారు. ఆయననూ సొంత గూటికి పంపించారు. ఇక నుంచి ఈ పోస్టును భర్తీ చేయవద్దని నిర్ణయించారు. ఈ అంశాలపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇంతటి రాద్ధాంతానికి మౌఖిక ఆదేశాలే కారణం కావడంతో రాతపూర్వక ఉత్తర్వులనే పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఇప్పుడు చోటు చేసుకున్న మార్పులతో ఈ విద్యా సంవత్సరంలో సుమారు 200 మందిని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలతో పాటు మరికొన్ని విద్యాలయాల్లో సర్దుబాటుకు కౌన్సెలింగ్ పద్ధతిని ఆశ్రయించాలని తగు జాబితాలను తయారు చేస్తున్నారు.

పీవోను కలిసిన హెచ్‌ఎంలు

ఆర్టికల్ ఛార్జి మెమోలు అందుకున్న 35 మంది ప్రధానోపాధ్యాయులు పీవో గౌతమ్‌తో పాటు డీడీ రమాదేవిని ఇప్పటికే కలిసి తమ వివరణ ఇచ్చారు. అధికారులు చెప్పిన విధంగా తరగతుల నిర్వహణకు ఇబ్బంది రాకుండా చూశామని తెలిపారు. ఈ అంశంపై చర్యలు ఉంటాయా లేక సమస్యను ఇంతటితో ముగిస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

# మునుపల్లె కాదు..



భద్రాచలం : పచ్చని చెట్లు, ప్రకృతి పరిమళాలు, ఆత్మీయ పలకరింపులు, రణగొణ ధ్వనుల్లేని వీధులు ఇవన్నీ పల్లె కొలువులు, నెలవులు.. విశాల స్థలంలో పూరి గుడిసెలు, లేకుంటే పెంకుటిళ్లు, కాకుంటే రెండు గదుల డాబాలు.. ఇంతకుమించి గ్రామాల్ని ఊహించలేకపోయేవాళ్లం. కానీ ఇప్పుడు మును'పల్లె' లేదు.. అక్కడి ఇళ్లను చూస్తే 'అంతకుమించి' అనాలి. కొన్ని గ్రామ సౌధాలు పురాలను తలపిస్తున్నాయి. ఇంకొన్ని తలదన్నేలా కనిపిస్తున్నాయి. పాలరాతి గదులతో నిర్మించిన సుందర భవనాలు చాలా సందుల్లో సాక్షాత్కరిస్తున్నాయి. అద్దాల మేడలు కొన్ని వీధుల్లో ముద్దగా పేర్చినట్టున్నాయి. 'అంతస్తుల భవనాలు' అంతుపట్టకుండా పెరుగుతున్నాయి. విశేషం ఏమిటంటే మట్టి వాసనల్ని గట్టిగా నిలుపుకొంటూనే కాంక్రీటు గృహాలు ఒద్దికగా కట్టుకుంటున్నారు. లోగిలిలో చలువ రాళ్లను పరుచుకున్నా ఆరుబయట అరుగులు ఉండాల్సిందే. ఇంటి లో శీతల యంత్రాలున్నా పెరడు పల్లె పరిమళాలు పూయాల్సిందే.. హాల్‌లో రాజఠీవిని ఒలకపోసే సోఫాలున్నా, ఆరుబయట నులక మంచం వేయాల్సిందే. వసతుల్లో పురాన్ని తన పరం చేసుకున్న పల్లె సంస్కృతిలో వస్తున్న మార్పులివి. ఉభయ జిల్లాలోని గ్రామ సీమల్లో కొన్నేళ్లుగా భారీ గృహాలతోపాటు నిర్మించుకునే వారి సంఖ్యా పెరుగుతుంది. పూర్వ ఖమ్మంలోని గ్రామీణ జీవనంలో వచ్చిన మార్పులను ప్రస్తావించే కథనమే ఇది..

ఉభయ జిల్లాల్లోని గ్రామాల్లో చాలాచోట్ల డబుల్ బెడ్‌రూమ్‌లు, అంతస్తులు, పెంట్‌హౌస్‌లు దర్శనమిస్తున్నాయి. వాటిల్లో ఎన్నో హంగులు కనిపిస్తున్నాయి. హరివిల్లును మించి రంగులద్దడం, ఇంటీరియల్ డెకరేషన్, హాలు, వంటగది, డైనింగ్ ఏరియా, మాస్టర్ బెడ్‌రూమ్‌లు, చిల్డ్రన్ బెడ్‌రూమ్‌లు ఇలా అనేక రకాల విభాగాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సీలింగ్‌లో మిరుమిట్లు గొల్పే లైట్లు, ఆకర్షణీయ డిజైన్లు, స్నానాల గదుల్లో షవర్లు, వేడి నీటి కోసం గీజర్లు, హాల్‌లో టీవీ యూనిట్, సోఫా సెట్లు, ఏసీ యంత్రాలు, ఇలా ఒకటేంటి ఎన్నో వస్తువులో ముస్తాబైన గృహాలు ఇప్పుడు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు ఇవన్నీ కేవలం పట్టణాలు, నగరాల్లోని ఇళ్లలో కనిపించేవి. పోకడలు ఇలా.. జూలూరుపాడు మండలం అనంతారంలో రైతు కుటుంబాల వారంతా ఒకరికి మించి ఒకరు అందమైన గృహాలు నిర్మించుకున్నారు. పట్టణ వీధిని తలపించే రీతిలో వీరి వాడలున్నాయి. ఇదే మండలం గుండెపూడిలో ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులందరికి ఒకే దగ్గర నివాసం ఉండేలా భారీ గృహం నిర్మించారు. చుట్టూ పచ్చని పొలాలు, ఇంటి పెరడు మధ్య దీన్ని ఆవిష్కరించారు.

కల్లూరు మండలంలోని చెన్నూరు, ఎర్రబోయినపల్లి, లింగాల గ్రామాల్లో ఎన్నారైలు తమ తల్లిదండ్రులకు ఆధునిక సౌధాలను కట్టించారు.

సత్తుపల్లి మండలంలోని నారాయణపురం, కొత్తూరు, గంగారం, కిష్టారం బుగ్గపాడు, సిద్ధారం, గౌరీగూడెం గ్రామాల్లో ఎన్నారైలు, స్థానిక రైతులు విశాల భవనాలు నిర్మించుకున్నారు.

తల్లాడ మండలం అంజనాపురం, రామానుజవరం, మిట్టపల్లిలో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు వెచ్చించి అత్యంత ఖరీదైన భవనాలు ఏర్పాటు చేసుకున్నారు.

మధిర మండలం నిదానపురం, దెందుకూరు, సిరిపురంలో భిన్న రీతుల్లో, ఆకృతుల్లో తీర్చిదిద్దారు.

బూర్గంపాడు మండలం సంజీవరెడ్డిపాలెంలో సుమారు 100 కుటుంబాలున్నాయి. ఇక్కడ ఒక్క పూరిల్లు లేదు. ఇక్కడి రైతువారీ కుటుంబాలు వసతులతో కూడిన భవనాలు నిర్మించుకున్నారు. ఇరవెండి, మోతె, సొంపల్లి, కృష్ణసాగర్ గ్రామాల్లో ఇదే తరహా పరిస్థితులున్నాయి.

కొణిజర్ల మండలం అమ్మపాలెం, రాజ్యాతండా, తనికెళ్ల, పెనుబల్లి మండలం చింతగూడెం, లింగూడెం, ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, భీమవరం, బనిగళ్లపాడు, చింతకానిలోని నాగులవంచ గ్రామాల్లో భవన సముదాయాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి.

ఖర్చుకు వెనకాడటం లేదు

రెండు గదులు, పశువుల చావిడి ఉంటే చాలనుకునే భావన నుంచి ఇప్పుడు తమ గృహాన్ని స్వర్గసీమగా మార్చుకోవటంలో ఒకరికొకరు పోటీ పడుతున్నారు. ఖర్చుల విషయంలో వెనకాడటం లేదు. సాధారణ ఇంటి నిర్మాణానికే కనీసం రూ.30 లక్షలు ఖర్చవుతుంది. అదీనూ స్థలం కాకుండా. గ్రామాల్లో కొందరు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు వ్యయం చేస్తున్నారు.

కారణాలేంటి..?

భూముల ధరలు బాగా పెరిగాయి. కొనుగోలు శక్తి అధికమైంది. దీంతో ఉన్న ఊరిలోనే మంచి గూడు నిర్మించుకోవాలన్న భావన విస్తరించింది.

ఎన్‌ఆర్‌ఐ పిల్లలు తమ తల్లిదండ్రులకు వార్థక్యంలో వసతులతో కూడిన ఇళ్లను సమకూరుస్తున్నారు. హైదరాబాద్ తర్వాత పూర్వ ఖమ్మం జిల్లాలోనే ఎన్‌ఆర్‌ఐ కుటుంబాలు అధికంగా ఉన్నాయి.

ఉభయ జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రోడ్డు, ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడ్డాయి. దీంతో వైద్యం, ఇతర అవసరాలను పల్లెల్లో ఉంటూనే తీర్చుకోగలుగుతున్నారు. అందమైన ఇంటితోపాటు కార్లు, ఇతర వ్యక్తిగత మోటారు వాహనాలను సమకూర్చుకుంటున్నారు.

విద్యుత్తు, వినోదం, ఇంటర్‌నెట్ లాంటి సౌకర్యాలు ముంగిట్లో వాలటం.

స్వచ్ఛమైన గాలి మధ్య మలిజీవనం గడపాలని కొందరు విశ్రాంత ఉద్యోగులు పల్లెబాట పట్టడం.

# రేడియాలజీ హబ్‌లో ఆధునిక యంత్రాలు

ములుగు : ములుగులో నూతనంగా ఏర్పాటు చేసిన రేడియాలజీ హబ్ జిల్లా ప్రజలకు వరంగా మారనుంది. హబ్‌లో సరికొత్త యంత్రాలు ఏర్పాటు చేశారు. అనధికారికంగా సేవలు ప్రారంభమయ్యాయి. ములుగు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే జిల్లా ఆసుపత్రిలో సీటీస్కాన్ యంత్రం ఉండగా రేడియాలజీ హబ్‌తో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. గతంలో ఈసీజీ ఆధారంగానే గుండె జబ్బును నిర్ధారించేవారు. దాని కంటే మెరుగైన 2డీ ఎకో యంత్రం అందుబాటులోకి వచ్చింది. దీంతో గుండె పనితీరును తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. గతంలో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేవు. ప్రస్తుతం మామోగ్రాఫ్ యంత్రం కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధుల నిర్ధారణ సులభం కానుంది. హబ్‌లో ప్రస్తుతం 2డీ ఎకో, మామోగ్రాఫ్, అల్ట్రాసౌండ్, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం టెక్నీషియన్‌లతో ఎక్స్‌రే, మామోగ్రాఫ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. జిల్లాలో ప్రైవేటులో కూడా మామోగ్రాఫ్, 2డీ ఎకో పరీక్షలు అందుబాటులో లేవు. ఈ పరీక్షల కోసం జిల్లా ప్రజలు వరంగల్ లాంటి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో సీటీ స్కాన్ సహా నిర్దేశించిన అన్ని రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు దూరాభారం తప్పనుంది.

# అధునాతనం.. సౌకర్యం

గోదావరిఖని : రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయింది. రూ.19 కోట్లతో చేపట్టిన నిర్మాణం నాలుగేళ్లలో పూర్తి చేశారు. 2018, జనవరి 5న పనులు ప్రారంభించిన రామగుండం పోలీసు కమిషనరేట్ భవనాన్ని 2022 జూన్ 31 నాటికి పూర్తి చేశారు. అధునాతన సౌకర్యాలతో రెండు అంతస్తుల్లో నిర్మించారు. గోదావరిఖని పోలీసు హెడ్ క్వార్టర్‌లోని కమిషనరేట్ ఆవరణలో పోలీసు అధికారులకు, వివిధ విభాగాల కార్యాలయాలతో పాటు సమావేశ మందిరాలు, శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రత్యేక గదులను నిర్మించారు. రూ.38.50 కోట్లతో సీపీ కార్యాలయంతో పాటు కమిషనర్ నివాస గృహం, క్యాంపు కార్యాలయం, ఏఆర్ హెడ్ క్వార్టర్, బారెక్స్, పరేడ్ గ్రౌండును పూర్తి చేయాల్సి ఉంది.

ప్రత్యేక నేర సమీక్ష

కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక నేర సమీక్ష మందిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులతో ప్రతినెలా నిర్వహించే నేర సమీక్షకు హాజరయ్యే అధికారుల దస్త్రాలు పెట్టుకోవడానికి డెస్కులతో పాటు వివరాలు రాసుకోవడానికి ప్రత్యేకమైన బల్లలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు నేర సమీక్ష సమావేశం కోసం ఇతర సంస్థల సమావేశ మందిరాలను వినియోగించుకున్నారు. ఇక నుంచి కమిషనరేట్ భవనంలోనే నేర సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు.

శిక్షణ కేంద్రం

శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం పనిచేసే పోలీసులకు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులపై శిక్షణ ఇచ్చేందుకు ఈ కేంద్రంలో ఓ గదిని ప్రత్యేకంగా కేటాయించారు. 50 మంది కూర్చునే సామర్థ్యంతో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మరో శిక్షణ కేంద్రాన్ని 24 మంది కూర్చునే సామర్థ్యంతో నిర్మించారు.

సమావేశ మందిరం

పోలీసు అధికారులతో పాటు సిబ్బందితో నిర్వహించే సమావేశాలకు ప్రత్యేక మందిరాలు నిర్మించారు. పోలీసు అధికారులు అత్యవసర సమీక్ష కోసం ప్రత్యేకంగా సమావేశమయ్యేందుకు ప్రత్యేక హాలు ఏర్పాటు చేశారు. రౌండ్ టేబుల్‌తో పాటు చుట్టూ కుర్చీలు ఏర్పాటు చేసి అత్యవసర సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా ప్రత్యేక గది ఏర్పాటు చేశారు.

120 మంది కూర్చునేలా..

ప్రజల విజ్ఞప్తులు స్వీకరించేందుకు వారి కోసం వేచి ఉండు గది 120 మంది వరకు కూర్చునే విధంగా సౌకర్యం. రిసెప్షన్ కేంద్రం వీఐపీలు వేచి ఉండేందుకు ప్రత్యేక గది, పాస్‌పోర్టు వెరిఫికేషన్ కేంద్రం మహిళా పోలీసు విశ్రాంతి గది, సిబ్బంది భోజనం చేసేందుకు హాలు

డిజిటల్ ట్రైనింగ్ లాబోరేటరి, సీసీ టీవీ, ఐటీ కోర్ బృందానికి గది

కమాండ్ కంట్రోల్ గది

కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ గదిని ఏర్పాటు చేశారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్‌లు, నగరాలు, పట్టణాలతో పాటు చిన్న చిన్న గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన చిత్రాలను కమాండ్ కంట్రోల్ గదిలో వీక్షించే అవకాశం ఉంది. దీంతోపాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధించేందుకు కమాండ్ కంట్రోల్ గదిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

లోటు లేకుండా ఏర్పాట్లు– కోలేటి దామోదర్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్

కమిషనరేట్ కార్యాలయంలో ఎలాంటి లోటు లేకుండా అన్ని సౌకర్యాలతో భవనం నిర్మించాం. పోలీసు అధికారులతో పాటు సిబ్బందికి అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయాన్ని రూపొందించాం. కమిషనరేట్ కార్యాలయంతో పాటు ఇతర భవనాలకు సైతం హెడ్ క్వార్టర్‌లో నిర్మాణాలు చేపడతాం. ప్రస్తుతం కమిషనరేట్ కార్యాలయ భవనం పూర్తయింది. మిగతా వాటిని సైతం త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

# ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

రాయికల్ : జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసేందుకు 'పీఎంశ్రీ'(ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో 15 ఎంపిక ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం(పీఎంశ్రీ) ద్వారా ఇటీవల పలు పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 6448 పాఠశాలలను ఎంపిక చేయగా తెలంగాణలో 543, జగిత్యాల జిల్లాలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. జిల్లాలోని జగిత్యాల ఓల్డ్ హైస్కూల్, ధరూర్ ఉన్నత పాఠశాల, మేడిపల్లి మండలం వెంకటరావుపేట ఉన్నత పాఠశాల, మెట్‌పల్లి పెద్దపల్లి గురుకుల పాఠశాల, సారంగాపూర్ మండలంలోని కోనాపూర్, రాయికల్, వెల్గటూరు,కోరుట్ల, పెగడపల్లి, ధర్మపురి, జగిత్యాల, గొల్లపల్లి, మండలాల్లోని 8 ఆదర్శ పాఠశాలలు, కోరుట్ల బాలికల ఉన్నత పాఠశాల, బీర్‌పూర్ పాఠశాలలు ఉన్నాయి.

విద్యా ప్రమాణాలు పెరుగుతాయి–శ్రీధర్, ఇటిక్యాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్

పీఎంశ్రీ పథకం ద్వారా అందించే నిధులతో పాఠశాలల్లో వసతులతో పాటు ఇతర సదుపాయాలు సమకూర్చుకోవచ్చు. జాతీయ విద్యా విధానం అమలుతో విద్యా ప్రమాణాలు పెరగడంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటు తరహా విద్య, వసతులు విద్యార్థులకు చేరువవుతాయి. పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు, ఇతర నైపుణ్యతలో శిక్షణ అందుతుంది.

ఐదేళ్లలో రూ.2.30 కోట్లుజిల్లాలోని పాఠశాలలను మూడు దశల్లో పరిశీలించి ఎంపిక చేశారు. మొదటి దశలో కేంద్ర ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హామీ పొందింది. రెండో దశలో పాఠశాలల్లో వసతులు తదితర వివరాలు పొందుపరిచే యుడైస్ వివరాలు పరిగణనలోకి తీసుకుని కేంద్రీయ, నవోదయ విద్యాలయాల సిబ్బందితో పాఠశాలల్లో తనిఖీలు చేయించి పాయింట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం మార్కులు సాధించడంతో పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపికైన ప్రతి పాఠశాలకు ఏటా రూ.46 లక్షల చొప్పున ఐదేళ్ల పాటు రూ.2.30 కోట్ల నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం చొప్పున మంజూరు చేస్తాయి. ఈ నిధులతో పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం రూపొందించడం, సౌరవిద్యుత్తు ఏర్పాటు, విద్యార్థుల ఆరోగ్య రక్షణ, పాఠశాలలో కూరగాయల పెంపకం, వాటితోనే భోజనం అందేలా చర్యలు, ఎల్‌ఈడీ దీపాలు, డిజిటల్ గ్రంథాలయం, ఐసిటీ ల్యాబ్, రక్షిత నీటి పథకం, క్రీడా మైదానం, క్రీడలకు ప్రోత్సాహం, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, అంతర్జాల సదుపాయం, వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కల్పిస్తారు.

# నీటిని ఒడిసిపట్టే నిర్ణయం..!

జనగామ : నీటిని ఒడిసి పట్టడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే ప్రతి ఇంటి నుంచి వృథాగా వెళ్లే నీటిని ఎక్కడికక్కడే ఇంకేందుకు ఇంకుడుగుంతల నిర్మాణాన్ని ఉద్యమంగా నిర్వహించింది. ఇప్పుడు గ్రామాల్లో సామూహికంగా నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ప్రాంతాలను గుర్తించి..ప్రతి గ్రామపంచాయతీలో నీరు వృథాగా పోతున్న ప్రాంతాలు మొదట గుర్తిస్తారు. ఎక్కడెక్కడ ఇంకుడు గుంతలు నిర్మించడానికి అవకాశాలున్నాయో పరిశీలించి, అధికారులు ఒక అంచనాకు వస్తారు. వీలైనన్నీ నిర్మించి నీటిని ఒడిసిపట్టాలని నిర్ణయించారు. ఒక్కో నిర్మాణానికి రూ.12,700 ఖర్చు చేస్తారు. రూ.10 వేలతో విలువైన కంకర, దొడ్డురాయి, ఇసుక తదితర సామగ్రి కొనుగోలు చేస్తూ, మిగతా సొమ్మును కూలీలకు వేతనంగా చెల్లిస్తారు. ఎనిమిది రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రధానంగా నీటి వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాలు పాఠశాలలు, నీటి ట్యాంకులు, ప్రజోపయోగ నీటి కుళాయిలు వసతి గృహ సముదాయాల వద్ద వీటి



నిర్మాణానికి ప్రాధాన్యమిస్తారు. వీలైనంత వరకు నీరు అధికంగా బయటకుపోతున్న ప్రాంతాల్లచి వీటిని నిర్మిస్తారు. పొడవు, లోతు, వ్యాసం రెండు మీటర్ల నిడివితో వీటిని నిర్మిస్తారు.

ఆన్ ఆఫ్‌ల్లేక వృథాగా...గత కొన్నేళ్లుగా భారీ వర్షాలు కురవడం, చెరువుల్లోకి నీరు చేరుతుండడంతో గ్రామీణ ప్రాంతాలలో భూగర్భజలమట్టం గణనీయంగా పెరుగుతోంది. కొన్ని చోట్ల సిబ్బంది నిర్లక్ష్యంతో, కుళాయిలకు నియంత్రికలు లేకపోవడంతో నీరు వృథాగా పోతుందని ప్రభుత్వం గమనించింది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో నీటికొరత ఏర్పడుతుందని, భావిపౌరులకు జలసిరి విలువ తెలవకపోయే ప్రమాదముందని ఓ ఆలోచన చేసింది. పంచాయతీల్లో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలని సంకల్పం తీసుకుంది.

# రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు

జనగామ : ఆహార భద్రత పథకం.. దారిద్ర్యరేఖ దిగువన జీవిస్తున్న నిరుపేదలకు వరం. ఈ పథకంతో ఎన్నో కుటుంబాలు ఆకలి తీర్చుకుంటున్నాయి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్విరామంగా అమలు చేస్తున్నాయి. నెలనెల బియ్యాన్ని లబ్ధిదారులకు అందిస్తుంది. కొందరు లోపాలు పసిగట్టి అక్రమదారులు వెతుకుతున్నారు. లబ్ధిదారులు, డీలర్లు బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. లబ్ధిదారులు బియ్యం తీసుకోకుండా.. డీలరు నుంచి కిలోకు గరిష్ఠంగా రూ.8, కనిష్ఠంగా రూ.5 వరకు తీసుకుంటున్నారు. వారు వాటిని అక్రమదారిలో అమ్ముకుంటున్నారు. పూర్తి వివరాలతో కథనం.లొసుగులెన్నో..బియ్యం పక్కదారి పట్టడానికి రకరకాల కారణాలు, లొసుగులు ఉన్నాయి. ఆహార భద్రత పథకానికి అర్హులైన కార్డు సభ్యులు.. ప్రతి పల్లెలో సుమారు పది శాతం మేర ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. వారిలో ఎవరైనా ఒకరికి.. స్థానికంగా పని పడితే స్వస్థలానికి వచ్చి దుకాణాల్లో వేలిముద్రలు పెట్టి వెళ్తారు. వారు బియ్యం తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. కానీ వాస్తవానికి వారు మాత్రం తీసుకెళ్లరు. డీలర్లతో బేరసారాలు మాట్లాడుకుంటారు. లబ్ధిదారులకు నగదు ఇచ్చి.. వీలైనప్పుడు డీలర్లు అక్కడి నుంచి సరకు తరలిస్తారు. లబ్ధిదారులు వేలిముద్ర పెడితే తప్పా.. సరకులు తీసుకునే పరిస్థితి ప్రస్తుతం లేదు. మూడు నెలల్లో కచ్చితంగా ఒకసారైనా వేలిముద్ర పెట్టాల్సిందే.

కొరవడిన తనిఖీలు..లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత పౌరసరఫరాలశాఖ, ఇతర శాఖల అధికారులపై ఉంది. కానీ వారు అడపాదడపా తనిఖీలు చేస్తూ.. పూర్తిగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. పోలీసుల తనిఖీల్లో మాత్రం అక్కడక్కడ పట్టుకుంటున్నారు. అనంతరం వారు పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. రెండేళ్లుగా కరోనా సమయంలో ప్రజలకు ఉచితంగా అందించగా.. ఆ సమయంలోనూ తనిఖీలు అరకొరగా జరిగాయని తెలుస్తోంది. సమాచారమిస్తే అడ్డుకుంటాం– రోజారాణి, పౌరసరఫరాలశాఖ అధికారి, జనగామ

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు లబ్ధిదారులు, ప్రజలు సమాచారమిస్తే తక్షణమే అడ్డుకుంటాం. డీలర్లే కొనుగోలు చేసేందుకు ప్రజలతో నేరుగా బేరసారాలు చేస్తున్నట్లుగా మా దృష్టికి రాలేదు. నిత్యం తనిఖీలు పకడ్బందీగానే చేపడుతున్నాం. కరోనా కాలంలోనూ నిర్విరామంగా తనిఖీ చేశాం. పక్కదారి పడుతున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవు. ఇలాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు.

జరుగుతుంది ఇలా..ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు చౌకధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని ప్రజలకు అందజేస్తున్నారు. లబ్ధిదారుల వేలిముద్ర గానీ, ఐరిస్ స్కాన్‌తోనైనా ఆయా కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా ఒక్కో వ్యక్తి పేరిట ఆరు కిలోలు ఇవ్వాల్సి ఉంటుంది. కాగా చాలా మంది అనర్హులు లబ్ధిదారులుగా ఉండడం, మరో వైపు బీపీఎల్ కుటుంబాలు కూడా దొడ్డు బియ్యం తినడానికి ఆసక్తి చూపడం లేదు. వాటిని అమ్ముకుంటూ.. వచ్చిన డబ్బులతో సన్నబియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న డీలర్లు దారి మళ్లిస్తున్నారు. రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో అక్కడక్కడ ఉంటున్నాయి.

# సమస్యలు చర్చకొచ్చేనా.. ప్రయోజనం కలిగేనా!



మెదక్ : ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా ఇంత వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కాలేదు. 6.90 లక్షల పాఠ్యపుస్తకాలకు గాను ఇప్పటి వరకు 3.11 లక్షల పుస్తకాలే వచ్చాయి. ఏకరూప దుస్తుల జాడేలేదు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద తొలి విడతగా 95 పాఠశాలల్లో పనులు మొదలయ్యాయి. ఆయా పనులు మందకొడిగా సాగుతున్నాయి.

వ్యవసాయ ఆధారిత జిల్లా.... బోరు బావులపైనే ఎక్కువగా ఆధారపడుతారు. సాగు ప్రాజెక్టులు అంతంత మాత్రమే.. ఎగువన కురిసే వర్షాలతో పంటపొలాలకు నీరందుతోంది. ప్రతి ఎకరాకు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలున్నాయి. పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. పల్లెల్లో విద్యుత్తు సమస్యలు వేధిస్తున్నాయి. కేవలం నాలుగైదు శాఖలపైనే జడ్పీ సమావేశాల్లో చర్చిస్తున్నారు. సర్వసభ్య సమావేశం నేపథ్యంలో కథనం.

పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు గడిచాయి. ఇప్పటికే సగం పదవీకాలం ముగియగా, మూడు నెలలకోసారి సమావేశాల నిర్వహణకు అవకాశం ఉంది. సర్వసభ్య సమావేశానికి ముందు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తారు. ఇందులో సభ్యులకు అవకాశం ఉన్నా...వారి హాజరు అంతంత మాత్రంగా ఉంటోంది. సర్వసభ్య సమావేశంలో 45 ప్రభుత్వ శాఖలకు సంబంధించి సమస్యలను ప్రస్తావించేందుకు అవకాశం కల్పిస్తారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ సమస్యలను ప్రస్తావిస్తుండడంతో వాటిపైనే చర్చ జరుగుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నాయి. నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. పెట్టుబడికి సాయం అందడంలో జాప్యం జరిగింది. ఈనెల 28 నుంచి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించగా.... ఇప్పటికే రైతులు ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేశారు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద వడ్డీకి తీసుకొచ్చి సాగు పనులు మొదలుపెట్టారు. యాసంగి ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించాలి. 20,936 మంది రైతులకు రూ.116.38 కోట్లు జమ కావాల్సి ఉంది. ఘనపూర్, హల్దీ ప్రాజెక్టులు ఉండగా, ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే ఉద్దేశంతో చేపడుతున్న కాళేశ్వరం కాలువల పనులు వేగం అందుకోవాల్సి ఉంది. జిల్లాలో 13,17,18,19 ప్యాకేజీల ద్వారా 93 వేల ఎకరాలకు నీటిని అందించాలని నిర్దేశించారు. 17వ ప్యాకేజీ 47 శాతం, 18 ప్యాకేజీ 39 శాతం పనులు పూర్తయ్యాయి. ఘనపూర్ ఎంఎన్, ఎఫ్ఎన్ కాలువ ఆధునికీకరణ పూర్తి కాలేదు. ఎత్తుపెంపు పనులు సైతం ముందుకు సాగడం లేదు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు పల్లె దవాఖానాలను ఏర్పాటు చేశారు. ఎంబీబీఎస్ అర్హతతో వైద్యుల నియామకం చేపట్టాల్సి ఉండగా.. ఎవరు ముందుకు రావడం లేదు. జిల్లాలో 19 పీహెచ్‌సీల పరిధిలో 157 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. పలు చోట్ల వైద్యుల గైర్హాజరు కారణంగా పలు పీహెచ్‌సీల్లో వైద్య సేవలందడంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల పెద్దశంకరంపేట మండల పరిషత్తు సమావేశంలో సభ్యులు, మండల వైద్యాధికారి తీరును తప్పుపట్టారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల గదుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో హవేలిఘనపూర్, చిలప్‌చెడ్, నిజాంపేట, నార్సింగి, మనోహరాబాద్, మాసాయిపేట మండలాలు ఏర్పడ్డాయి. ఇప్పటి వరకు తహసీల్దార్, మండల పరిషత్తు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు అద్దెభవనంలో కొనసాగుతున్నాయి. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో మాత్రమే సమీకృత భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. పల్లెప్రగతి కార్యక్రమంలో ప్రత్యేకంగా పవర్ డే నిర్వహించినప్పటికీ.. సమస్యలను గుర్తిస్తున్నారే తప్ప. పరిష్కారానికి చొరవ చూపడం లేదు. 2,143 విద్యుత్తు స్తంభాలకు మూడో తీగ లేనట్టు గుర్తించగా కేవలం 329 స్తంభాలకు ఏర్పాటు చేశారు. దెబ్బతిన్న, తుప్పుపట్టిన 1,389 స్తంభాల్లో కేవలం 40 తొలగించారు. వేలాడుతున్న, వదులుగా ఉన్న విద్యుత్తుతీగలు 1,109 గాను 116 మాత్రమే సరిచేశారు.

సాధ్యమైనంత మేర చర్చించి.. పరిష్కరిస్తాం– హేమలతగౌడ్, జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు

సమయాభావంతో కేవలం కొన్ని శాఖలపైనే చర్చ జరుగుతోంది. కనీసం 12 శాఖలపైనా చర్చ జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఒక్కో శాఖ అధికారులను పిలిచి సభ్యులు లేవనెత్తిన అంశాలు పరిష్కారమయ్యేలా చూస్తాం. మండలాల్లో జడ్పీ నిధులతో రూ.10 కోట్ల విలువైన పనులను చేపడుతున్నాం. ఇటీవల సభ్యులకు రూ.5 కోట్ల పనులకు సంబంధించి ప్రొసీడింగ్స్ ఇచ్చాం. ప్రారంభంలో నిధుల సమస్య ఉన్నా... ప్రస్తుతం ఇబ్బందులు లేవు.

# పునరుజ్జీవమే లక్ష్యంగా అడుగులు..



మెదక్ : మెదక్ జిల్లాలో నర్సాపూర్ అడవులకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇక్కడ ఈసారి మరింత పచ్చదనం పెంచాలన్న లక్ష్యంతో మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వర్షాకాలం కావడంతో తదనుగుణంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి తదితర మండలాల్లో హరితహారంలో భాగంగా 5 నుంచి 6 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఇందులో ఎక్కువగా అటవీ జాతులు నాటాలని నిర్ణయించారు. ఇదివరకే జల సంరక్షణ పనులన్నీ పూర్తిచేసిన అధికారులు అడవుల్లో పడిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఈ ఏడాది అడవుల పునరుద్ధరణకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై కథనం.నర్సాపూర్ పేరు చెప్పగానే అడవులే గుర్తుకొస్తాయి. ఇప్పటికే పచ్చని అడవులతో ఆకట్టుకుంటున్న ఈ ప్రాంతంలో మరింతగా అడవులను అభివృద్ధి బాట పట్టించాలని నిర్ణయించారు. దీనికితోడు వర్షాల కోసం అటవీ జాతులు నాటేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. అడవులకు పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు, పచ్చదనం పెంచే దిశగా అటవీ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది నర్సాపూర్‌లో కేంద్రీయ నర్సరీతో పాటు ఆయా గ్రామాలు, మండలాల్లో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలు పెంచారు. ఇందుకు ఉపాధి హామీ నిధులను వెచ్చించారు.

ఆధునిక పద్ధతుల్లో..నర్సాపూర్ అటవీ క్షేత్రాధికారి పరిధిలో వన్ డెన్సిటీ గ్రీన్ యాక్షన్ పద్ధతిలో నర్సాపూర్, పిల్లుట్ల, నత్నాయిపల్లి, రుస్తుంపేట, నారాయణపూర్ ప్రాంతాల్లో మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో గతంలోని నీలగిరి వృక్షాలను తొలగించి వాటి స్థానంలో అటవీ జాతులను నాటనున్నారు. ప్రతి మొక్క మధ్య మీటరు దూరం ఉండేలా మూడు లక్షల వరకు నాటేందుకు సిద్ధమయ్యారు. వానలు కురవడమే ఆలస్యం.. సదరు ప్రక్రియ మొదలుకానుంది. సెమీ మెకానికల్ మెథడ్ విధానంలో చిప్పల్‌తుర్తిలో 30 హెక్టార్లు, నారాయణపూర్, పిల్లుట్లలో 15 హెక్టార్ల చొప్పున మొక్కలు నాటనున్నారు.

అటవీ జాతులు..ఈసారి అత్యధికంగా అటవీ జాతులు నేరేడు, మర్రి, జువ్వి, నెమలినార, సీమ చింత, మారేడు, కరక్కాయ, తాని, రావి, వెలగ, సీమ, తెల్లమద్ది, కానుగ, వేప, ఇప్ప, మద్ది, బుద్ధధరణి, ఉసిరి, తులసీ, కలబంద వంటి రకాలు నాటాలని సిద్ధం చేశారు. రిజర్వ్‌డ్ ఫారెస్టులో సహజ సిద్ధమైన అడవుల పునరుద్ధరణకు పూనుకున్నారు. అటవీ జాతులు నాటి సంరక్షిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశాలున్నాయని ఈ దిశగా అడుగేస్తున్నారు. ఇదివరకే దట్టమైన అడవులున్న నర్సాపూర్‌కు సుదూర ప్రాంతాల నుంచి ఔషధ మొక్కల కోసం ఎంతోమంది తరలి వస్తుంటారు. పట్టణ ఉద్యానాన్ని సందర్శిస్తుంటారు.

జల సంరక్షణ..

అడవుల్లో పడిన ప్రతి నీటి చుక్క వృథా కాకుండా సంరక్షణకు నడుంబిగించారు. ఇందుకు కంపా నిధులతో 11 చెక్‌డ్యాంలు, నాలుగు ఊట చెరువులు నిర్మించారు. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించగా.. వెంకట్రావుపేట, నర్సాపూర్, చాకరిమెట్ల సెక్షన్‌లలో నిర్మాణాలు చేపట్టారు. 90 హెక్టార్లలో కందకాలు తవ్వించారు. అడవుల రక్షణకు తీసిన కందకాలకు ఇరువైపులా మొక్కలు నాటనున్నామని అధికారులు ప్రకటించారు. కందకంపై గచ్చకాయ మొక్కలు నాటడం ద్వార అక్రమార్కులు లోనికి వెళ్లడానికి అవకాశం ఉండదు. లోపలి నుంచి వన్యప్రాణులు బయటకు రావడానికి అవకాశం ఉండదు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిస్తే అడవుల్లోని ఊట చెరువులు, చెక్‌డ్యాంలు నీటితో నిండితే తేమ శాతం పెరుగనుంది.

అంతా సిద్ధం

అంబర్‌సింగ్, ఎఫ్ఆర్వో, నర్సాపూర్

వర్షాలు పడగానే మొక్కలు నాటుతాం. అంతటా వర్షాలు కురిసినా ఇంతవరకు నర్సాపూర్ ప్రాంతంలో ఆశించినంతగా కురవలేదు. జలసంరక్షణ ద్వారా మొక్కలకు తేమ అందించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. నాటిన వాటిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటుచేస్తాం.

# భర్తీ చేయక.. భారం మోయలేక!

సంగారెడ్డి : ఈ చిత్రంలో కనిపిస్తున్నది సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని అంగన్వాడీ కేంద్రం. ఇక్కడ 15 మంది చిన్నారులు ఉండగా... నలుగురైదుగురు మాత్రమే వస్తున్నారు. సమీపంలోనే మరో కేంద్రం ఉంది. ఈ రెండింటి బాధ్యతలను ఒకే ఆయా చూసుకోవాల్సి ఉంది. దీంతో భోజనం వడ్డించడం, పిల్లల ఆలనాపాలనా చూసుకోవడం కష్టమవుతోంది. నిర్వహణ లోపం వల్ల చిన్నారులను అంగన్వాడీ కేంద్రానికి పంపడానికి తల్లిదండ్రులూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఆయాలు, టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాలు అన్నింటిలోనూ ఇలాంటి పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య సరిగా అందడం లేదు. అరకొర వసతులు, భవనాలు సరిగా లేకపోవడానికి తోడు కొన్ని చోట్ల టీచర్లు, ఆయాలు లేకపోవడంతో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. కనీసం అంగన్వాడీలకు చిన్నారులు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో 106 టీచరు, 389 ఆయాల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి గతేడాది సెప్టెంబరులో నోటిఫికేషన్ ఇచ్చారు. వీరి ఎంపిక ప్రక్రియ రాష్ట్రస్థాయిలోనే అపరిష్కృతంగా ఉందని జిల్లా అధికారులు



చెబుతున్నారు. దరఖాస్తులు అందించిన వారిలో ప్రతిభ చూపిన వారి జాబితాను జిల్లాలకు అందించాల్సి ఉంది. ఇక్కడే జాప్యం చోటు చేసుకుంటోంది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జాబితా ఇస్తే... తాము ధ్రువపత్రాలను పరిశీలించి వీలైనంత త్వరగా పోస్టులను భర్తీ చేస్తామని వివరిస్తున్నారు. జాబితా రాకపోవడంతో వీరూ ఏమీ చేయలేని పరిస్థితి. గత రెండేళ్లుగా కరోనా వల్ల అంగన్వాడీలకు చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు రాలేదు. ఈసారి విద్యాసంవత్సరం ప్రారంభంకావడంతో ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీలకు పంపేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారు. కొన్నిచోట్ల కనీసం వారి బాగోగులు చూసి... పూర్వ ప్రాథమిక విద్య నేర్పేవారు లేకపోవడంతో వెనకడుగు వేస్తున్నారు. ఒకవేళ వాళ్లు పంపినా.. అన్నం తినేసి చిన్నారులు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. భోజనం మీదా దృష్టి పెడితే..

అక్షయపాత్ర ద్వారా భోజనం అందిస్తున్న అంగన్వాడీల్లో చాలా మంది చిన్నారులు తినడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఉదయం 11గంటలలోపే భోజనం తెచ్చి.. గిన్నెల్లో నింపి వెళుతున్నారు. మధ్యాహ్నం అయ్యేసరికి అన్నం చల్లగా అయి ముద్దలుగా మారుతోంది. పిల్లలు కొంచెం అన్నం మాత్రమే తింటున్నారని... మిగతా అంతా వృథాగా అవుతోందని కొందరు ఆయాలు వివరించారు. మధ్యాహ్నం భోజనం వేడిగా అందేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రూ.3.54 కోట్లు వెనక్కి!

సంగారెడ్డి : పాఠశాలల నిధులను విద్యాశాఖ వెనక్కి తీసుకుంది. కొన్నేళ్లుగా వాటి ఖాతాల్లో మూలుగుతున్న ఈ నిధులు వినియోగించుకునే అవకాశం లేకపోవడంతో వెనక్కి పంపాలని ఆదేశించింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాల నుంచి రూ.3.54 కోట్లు నిరుపయోగంగా ఉన్నట్టు గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో బడుల ఖాతాలన్నీ ఖాళీ అయ్యాయి. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి నిధులు విడుదల కాకపోవడంతో బడిబాట, పాఠశాలల నిర్వహణ ఖర్చులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యాశాఖ నిర్ణయంపై ఉపాధ్యాయులు నిరసన తెలుతున్నారు. ఈనేపథ్యంలో కథనం.

వినియోగంలో నిర్లక్ష్యంజిల్లాలో 1,268 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటికి ప్రతి ఏడాది విద్యాశాఖ పాఠశాల గ్రాంటు పేరుతో నిధులు విడుదల చేస్తుంది. 1–20 విద్యార్థులు ఉంటే రూ.12,500, 20– 250 వరకు రూ.25 వేలు, 251ు500 వరకు రూ.50 వేలు, 501–750 వరకు రూ.75 వేలు, 751పైన ఉంటే రూ.లక్ష ప్రతి ఏడాది పాఠశాలలకు కేటాయిస్తుంది. వీటిలో పాటు బడుల్లో సివిల్ వర్క్స్, ఇతర పనులకు నిధులు విడుదల అవుతాయి. గత నాలుగు సంవత్సరాలుగా సివిల్ వర్క్స్‌కు సంబంధించిన నిధులు, రెండు సంవత్సరాలకు సంబంధించి వినియోగించని పాఠశాలల గ్రాంటు మొత్తాలు ఖాతాలలో మూలుగుతున్నాయి. ఖాతాలో ఉన్న ఈ మొత్తానికి బ్యాంకు నుంచి వడ్డీ కూడా జమయింది. జిల్లాలో అన్ని పాఠశాలల్లో కలిపి రూ.3.54 కోట్ల నిధులు ఉన్నట్లు సమగ్ర శిక్ష అధికారులు గుర్తించారు. పది రోజుల క్రితం ఈ నిధులను విద్యాశాఖ వెనక్కి తీసుకుంది. విద్యార్థులు తక్కువగా ఉన్న ఎక్కువ పాఠశాలల్లో ఈ నిధులు వినియోగానికి నోచుకోలేదు. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ



సభ్యుల మధ్య సఖ్యత లేకపోవడం వల్లా ఇబ్బందులు ఎదురయ్యాయి.

ఈ ఏడాది నిర్వహణకు ఇక్కట్లు

పాఠశాలల నిధులు ఖాళీ కావడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బడిబాట, పాఠశాల నిర్వహణకు సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల గ్రాంటు ఇంకా విడుదల కాలేదు. ఈ గ్రాంటు ప్రతి ఏడాది నవంబరులో మొదటి విడత, మార్చిలో రెండో విడత మంజూరవుతాయి. విద్యా సంవత్సరం చివరలో నిధులు విడుదల చేయడంతో కొన్ని పాఠశాలల్లో ఖర్చు చేయలేకపోతున్నారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి చాక్‌పీస్‌లు, బోధనా సామగ్రి, ఇతర సదుపాయాలు కల్పించి. నిధులు వచ్చిన తరువాత వాటిని తీసుకుదామంటే.. కొందరు ఎస్ఎంసీ సభ్యులు అభ్యంతరం తెలపడంతో ఖాతాలోనే ఉంటున్నాయి. ఈ ఏడాదికి సంబంధించిన నిధులు వెంటనే విడులల చేసేలా చూడాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. : – రాజేశ్, జిల్లా విద్యాధికారివినియోగానికి నోచని నిధులు జిల్లా పాఠశాలల నుంచి వెనక్కి వెళ్లాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ ఏడాదికి సంబంధించిన పాఠశాల గ్రాంటు విడుదల చేయాలని ఉన్నతాధికారులను కోరుతాం.

# శ్రీలక్ష్మీ మహా యజ్ఞంలో పాల్గొన్న సీఎం జగన్



అమరావతి: సనాతన ధర్మ పరిరక్షణతోపాటు రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతూ ప్రజలందరూ కల్యాణ సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టింది. విజయవాడ బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ యజ్ఞంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఉదయం 5గంటలకు మహామంగళ వాయిద్య హృద్య నాదం, భగవత్ ప్రీతిగా వేదస్వస్తి, గోపూజ, విఘ్నేశ్వర–విష్వక్సేన పూజలు, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అజస్ర దీపారాధన తదితర కార్యక్రమాలు మొదలయ్యాయి. సీఎం జగన్ యజ్ఞ సంకల్పం తీసుకున్న అనంతరం మహాయజ్ఞం ప్రారంభమైంది. గోశాల వద్ద ప్రత్యేక పూజలు చేసిన సీఎం జగన్.. కపిల గోవుకు హారతి ఇచ్చారు. అనంతరం అఖండ దీపారాధనలో పాల్గొన్నారు.

**నాలుగు ఆగమాల నడుమ..** మే 17వ తేదీ బుధవారం వరకు 6 రోజులపాటు ఈ మహాయజ్ఞం కొనసాగనుండగా.. వైఖానసం, పాంచ రాత్రం, శైవం, వైదిక స్మార్తం ఆగమాలతో ఏర్పాటు చేసిన నాలుగు ప్రధాన యాగశాలల్లో యజ్ఞాలు జరుగుతాయి. ఒక్కొక్క యాగశాలలో 27 కుండాల చొప్పున మొత్తం 108 కుండాలతో రుత్వికులు యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలి రోజు ఉదయం మినహా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగుతాయి. పవిత్ర సప్తనదీ, త్రి సముద్ర జలాలతో 1008 కలశాలతో విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

**భక్తుల కోసం నాలుగు క్యూలైన్లు** : యజ్ఞ కార్యక్రమాలను భక్తులు వీక్షించేలా ఉమ్మడిగా యాగశాలల చుట్టూ 4 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. యజ్ఞ కార్యక్రమాలను వీక్షిస్తూనే ఆ యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేసేలా వీటిని తీర్చిదిద్దారు. వాటిలో ఒకటి వీఐపీల కోసం కేటాయించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల ఆధ్వర్యంలో భక్తులకు రోజుకు ఒక ఆలయం చొప్పున ప్రసాదాల పంపిణీ చేపడుతున్నాయి. తొలిరోజు విజయవాడ దుర్గ గుడి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్రపొంగ లి పంపిణీ చేస్తారు. యజ్ఞం తొలిరోజున శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, 13న ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి, 14న అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి, 15న శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, 16న శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి. 17వ తేదీన చివరి రోజు సీఎం జగన్ చేతుల మీదుగా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర అన్వయంతో మహా పూర్ణాహుతితో యజ్ఞ కార్యక్రమాలు ముగుస్తాయి.

# రైతుల కష్టాలు కనపడటం లేదా? జగన్మోహన్ రెడ్డి గారు..?




విశాఖపట్నం: మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఇటీవల రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల కారణంగా పండించిన పంట కళ్లెదుటే తడిసి ముద్దవుతుండడంతో కన్నీరు మున్నీరవుతున్న రైతుల కష్టాలు మీకు కనపడటం లేదా జగన్మోహన్ రెడ్డి గారు..? మీ ప్రభుత్వం రైతులను ఆదుకునే ప్రయత్నం ఎందుకు చెయ్యడం లేదు.. కనీసం రైతుల సమస్యలు వినడానికైనా ప్రయత్నం చేయాలి కదా...? మీ మంత్రి ఒక జోకర్‌లాగా ధాన్యం మొలకెత్తితే నేనేమి చెయ్యాలి నోరుమూసుకో "ఎర్రిపప్ప" అని రైతును దుర్భాషలాడటం, మీ పనితీరుకు ఇదే నిదర్శనం" అంటూ ట్వీట్ చేశారు.

టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన, ఆయన ప్రసంగాలకు అడుగడుగునా అడ్డు తగిలేందుకు ఎందుకు ప్రయత్నం చేస్తున్నారని గంటా శ్రీనివాసరావు వైసీపీ నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. రైతులు పడుతున్న బాధలు చూసి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, వామపక్ష నాయకులు రైతుల పక్షాన నిలబడుతుంటే.. అధికారంలో ఉన్న సీఎం జగన్, వైసీపీ నాయకులు మాత్రం ఇళ్లకే పరిమితమయ్యారని విమర్శించారు. అన్నం పెట్టె రైతుల సమస్యల కంటే, అంత ముఖ్యమైన పనులు ముఖ్యమంత్రికి ఏముంటాయని గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు.




# వేసవి రద్దీ.. భక్తులు తితిదేకు సహకరించాలి: ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తిరుమలలో మే 14 నుంచి 18 వరకు ఐదురోజుల పాటు హనుమత్ జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తితిదే ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో భక్తులతో ఆయన మాట్లాడుతూ.. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈవో మాట్లాడారు. తిరుమలలో శనివారం ఉదయం రెండు ఘాట్ రోడ్లు, నడక మార్గాల్లో శ్రమదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొంటారని ధర్మారెడ్డి చెప్పారు. హనుమత్ జయంతి ఉత్సవాలలో భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా తిరుమల లోని అంజనాద్రి, ఆకాశగంగ, నాదనీరాజనం వేదికలపై అన్నమాచార్య, దాససాహిత్య, హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారులతో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మే 14న తుని తపోవనం సచ్చిదానంద స్వామి, మే 15న కుర్తాలం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, మే 16న కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి స్వామి, మే 17న అహోబిల మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి, మే 18న పుష్పగిరి మఠం పీఠాధిపతి విద్యాశంకర భారతీ తీర్థ స్వామీజీలు అనుగ్రహ భాషణం చేస్తారని వివరించారు.

తిరుమల వేదవిజ్ఞాన పీఠంలో ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు దాదాపు 18 గంటల పాటు 67 మంది ప్రముఖ పండితులతో అఖండ పారాయణ యజ్ఞాన్ని నిర్వహిస్తామన్నారు.

**సర్వదర్శనంలో రోజుకు 10–15 వేల మందికి మాత్రమే..** తిరుమలలో వేసవిలో రద్దీ ప్రారంభమైందని.. రోజుకు శ్రీవాణి, ప్రత్యేక ప్రవేశ దర్శనం, దివ్య దర్శనం టోకెన్లు కలిపి 55 వేలు కేటాయిస్తున్నట్లు ఈవో తెలిపారు. సర్వదర్శనంలో రోజుకు 10 నుంచి 15 వేల మందికి మాత్రమే దర్శనం కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కావున దర్శనానికి వచ్చే భక్తులు ఓపికతో ఉంటూ తితిదేకు సహకరించాలని కోరారు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదం కాంప్లెక్స్, ప్రధాన కళ్యాణ కట్ట కాంప్లెక్స్, ఏటీసీ సర్కిల్‌లో పాదరక్షలు భద్రపరిచే కేంద్రాలను ప్రారంభించామన్నారు. త్వరలో పీఏసీ 1, 2, 3, నారాయణగిరి క్యూలైన్లు, రాంభగీచా, సుపథం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కూడా ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు యథావిధిగా 1240వ మెట్టు వద్ద దివ్యదర్శనం టోకెన్లు ఇస్తామన్నారు. తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా శ్రీనివాసం, రైల్వే స్టేషన్ ఎదురుగా విష్ణు నివాసం, రైల్వే స్టేషన్ వెనుకవైపు గోవిందరాజస్వామి సత్రాల్లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ (ఎస్.ఎస్.డి) టోకెన్లు జారీ చేస్తున్నామని చెప్పారు. భక్తులు ఈ విషయాలను గమనించాలని కోరారు. తిరుమల శ్రీవారి దర్శనానికి అలిపిరి నడక మార్గంలో వెళ్లే భక్తులకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ వద్ద దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. ఇక్కడ టోకెన్లు పొందిన భక్తులు అలిపిరి మార్గంలో గాలిగోపురం వద్ద తప్పనిసరిగా స్కాన్ చేయించుకోవాలని.. లేనిపక్షంలో స్లాటెడ్ దర్శనానికి అనుమతించమని చెప్పారు. శ్రీవారి భక్తులు తితిదే పేరిట ఉన్న నకిలీ వెబ్‌సైట్ల కారణంగా మోసపోకూడదనే ఉద్దేశంతో తితిదే ఐటీ విభాగం క్షుణ్ణంగా పరిశీలించి 52 నకిలీ వెబ్‌సైట్లు, 13 నకిలీ మొబైల్ యాప్‌లను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. నకిలీ వెబ్‌సైట్ల గురించి తెలిస్తే 155257 కాల్‌సెంటర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. తితిదే అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే ఆర్జితసేవలు, దర్శనం, విరాళాలు, వసతి బుక్ చేసుకోవాలని భక్తులను ఈవో సూచించారు.




# ఎంపీ రఘురామ కస్టోడియల్ టార్చర్‌పై హైకోర్టు కీలక ఉత్తర్వులు

అమరావతి: నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్‌పై ఏపీ ప్రభుత్వానికి షాక్ తగిలింది. దీనిపై ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రఘురామను అదుపులోకి తీసుకున్న సమయంలో కాల్ డేటాను స్వాధీనం చేసుకొని భద్రపరచాలని, కాల్ డేటాను వెంటనే సేకరించాలని సీబీఐకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. కాగా తన కస్టోడియల్ టార్చర్‌పై సీబీఐ విచారణ జరపాలని కోరుతూ ఏపీ హైకోర్టులో ఎంపీ రఘురామకృష్ణంరాజు పిటిషన్ వేశారు. శుక్రవారం విచారణకు వచ్చింది. టెలికం నిబంధనల ప్రకారం రెండు సంవత్సరాలు మాత్రమే కాల్ డేటా ఉంచుతారని రఘురామ తరపు న్యాయవాది నౌమీన్ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే కాల్ డేటాను ప్రిజర్వ్ చేయాల్సిందిగా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. తర్వాత సీబీఐ తరపున అడిషనల్ సోలిసిటర్ జనరల్ హరినాథ్ వాదనలు వినిపించారు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ సిఐడీ వద్ద ఉందని, అందువల్ల కాల్ డేటాను సీఐడీ అధికారులే సేకరించాలని అన్నారు. పిటీషనర్ ఆరోపణలే సిఐడీ మీద అయితే... అదే సంస్థను కాల్ డేటా ఎలా సేకరించమంటారని హైకోర్టు ప్రశ్నించింది. కాగా ఈ కేసులో సీఐడీ ఇంప్లీడ్ పిటీషన్ వేసింది. కాల్ డేటా సేకరించమనడం చట్టవిరుద్ధమని సీఐడీ తరపు న్యాయవాది అన్నారు. అయితే సీఐడీ ఇంప్లీడ్ పిటీషన్‌ను ఇంకా అనుమతించలేదని హైకోర్టు పేర్కొంది. సీబీఐకు ఇవ్వాలా... లేదా అనేది కోర్టు ఇంకా నిర్ణయించలేదని, ఈ కేసులో కాల్ డేటా కీలకమని న్యాయవాది నౌమీన్ వాదించారు. దీంతో వెంటనే కాల్ డేటాను సేకరించి భద్రపరచాలని సీబీఐని న్యాయస్థానం ఆదేశిస్తూ.. కేసు తదుపరి విచారణను వేసవి సెలవుల అనంతరానికి వాయిదా వేసింది.

# జనసేన ఓ టెంట్‌హౌజ్ పార్టీ, చంద్రబాబుకు అవసరం వచ్చినప్పుడల్లా.. పవన్‌పై పేర్ని నాని సెటైర్లు



తాడేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి అవసరాలకు పెట్టిన టెంట్ హౌజ్ పార్టీనే జనసేన అని, పవన్ రాజకీయాలు కూడా కూడా చంద్రబాబు కోసమే నడుస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ఎద్దేవా చేశారు. పొత్తులపై జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై నాని స్పందిస్తూ.. "బలం లేదన్న విషయం పవన్‌కు ఇప్పుడు గుర్తొచ్చిందా?. పార్టీ పెట్టిన సమయంలోనే బలం లేదని పవన్‌కు తెలుసు. అప్పుడు బలం లేదు కాబట్టి పోటీ చేయలేదని చెప్పాడు. మరి 2019లో ఎందుకు పోటీ చేశాడు?. ఎందుకంటే.. 2019లో చంద్రబాబుకు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండడంతో ఆ ఓట్లు జగన్‌కు పడకుండా చీల్చడానికే జనసేన పోటీ చేసింది. ఓట్ల కోసం రాజకీయాలు చేయడం పవన్‌కే చెల్లింది. ఒకప్పుడు వంద కోట్ల రూపాయలు వదులుకుని.. రాజకీయాలు చేశానని చెప్పుకున్నాడు. మరి ఇప్పుడు.. చంద్రబాబుకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు బయటకు వస్తున్నాడు. ఏదో వాహనం(వారాహిని ఉద్దేశించి..) అంటూ హడావుడి చేసి ఇప్పుడు ముందస్తు ఎన్నికలు వస్తే బయటకు తీస్తా అంటున్నాడు. నా బాధ అంతా ఒక్కటే. పవన్‌ను నమ్ముకుని సాఫ్ట్‌వేర్ జాబ్స్ సైతం వదులుకుని.. పవన్‌ను సీఎం చేస్తామంటూ కంకణం కట్టకుని కొందరు ఊరురా తిరుగుతున్నారు. వాళ్లు తమ త్యాగాలను మానుకుని తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి" అని పేర్ని నాని సూచించారు.




# జగన్ పర్యటన.. వివాదాస్పదమై పోలీసుల వైఖరి

నెల్లూరు: సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో నెల్లూరు జిల్లా కావలిలో పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అవినీతిపై చర్యలు తీసుకోవాలంటూ భాజపా నేతలు సీఎం కాన్వాయ్‌కి ఎదురెళ్లి నిరసనకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ భాజపా నేతను పోలీసు అధికారి తన రెండు కాళ్ల మధ్య ఉంచి నిలువరించే ప్రయత్నం చేయడం వివాదాస్పదమైంది. పోలీసుల తీరుపై విపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తులో నిన్‌హైడ్రేట్ పరీక్ష!



హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రక్రియలో సీబీఐ కీలక నిర్ణయం తీసుకుంది. వివేకా రాసిన లేఖపై ఎవరెవరి వేలిముద్రలు ఉన్నాయో గుర్తించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. వేలిముద్రలను గుర్తించేందుకు నిన్‌హైడ్రేట్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నిన్‌హైడ్రేట్ పరీక్షకు అనుమతించాలని కోరుతూ సీబీఐ కోర్టులో అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. అయితే, దీనిపై నిందితుల అభిప్రాయాలు తెలపాలని కోర్టు ఆదేశించింది. ఈ అంశంపై జూన్ 2న సీబీఐ కోర్టు విచారణ జరపనుంది. హత్యాస్థలిలో లభించిన లేఖను సీబీఐ అధికారులు 2022, ఫిబ్రవరి 11న సీఎఫ్ఎస్ఎల్ పంపించి రెండు ప్రధాన అంశాలను తెలియజేయాలని కోరారు.

–లేఖను ఒత్తిడిలో రాశారా? లేదా? తేల్చాలని లేఖ రాశారు. అనంతరం వివేకా రాసిన ఇతర లేఖలను పోల్చి చూసిన తర్వాత ఆయన ఒత్తిడిలో లేఖ రాసినట్లు ఫోరెన్సిక్ నివేదికలు తేల్చాయి. తాజాగా లేఖపై వేలిముద్రలు కూడా గుర్తించాలని సీబీఐ నిర్ణయించింది. అయితే, లేఖపై వేలిముద్రల గుర్తింపునకు నిన్‌హైడ్రేట్ పరీక్ష నిర్వహించాలని సీఎఫ్ఎస్ఎల్ ను సీబీఐ అధికారులు కోరారు. ఈ పరీక్ష ద్వారా లేఖపై చేతి రాత, ఇంకు దెబ్బతినే అవకాశం ఉంటుందని వివరించింది. హత్య కేసు విచారణలో లేఖ ఇప్పుడు కీలక సాక్ష్యంగా ఉంది. ఒకవేళ పరీక్షలో లేఖ దెబ్బతిన్నట్లయితే దర్యాప్తు, ట్రయల్‌పై ఇబ్బంది ఉంటుందనే ఉద్దేశంతో సీబీఐ అధికారులు కోర్టును ఆశ్రయించారు.

ఒరిజినల్ లేఖ బదులు కలర్ జిరాక్స్‌ను రికార్డులో భద్రపరిచి దాన్ని సాక్ష్యంగా పరిగణించేందుకు అనుమతించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. లేఖపై వేలిముద్రలను అనుమానితుల వేలిముద్రలతో పోల్చాల్సి ఉందని.. నిన్‌హైడ్రేట్ పరీక్షకు అనుమతించాలని కోరారు. వివేకాతో బలవంతంగా లేఖ రాయించినట్లుగా దస్తగిరి వాంగ్మూలంలో పేర్కొన్నారని సీబీఐ కోర్టుకు తెలిపింది. దీనిపై జూన్ 2న న్యాయస్థానం విచారణ జరపనుంది.

# 'పాలకుడిని కాదు.. పాలేరునని పవన్ ఒప్పుకున్నాడు'



తాడేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్ కల్యాణ్‌పై మంత్రి జోగి రమేష్ సీరియస్ అయ్యారు. పాలకుడిని కాదు.. పాలేరునని పవన్ ఒప్పుకున్నారని ఎద్దేవా చేశారు. పవన్ని నమ్ముకుంటే నట్టేట ముంచారని కార్యకర్తలు బాధ పడుతున్నారని కామెంట్స్ చేశారు. కాగా, మంత్రి జోగి రమేష్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్.. చంద్రబాబుకు పాలేరు. పదేళ్లుగా జెండాలు మోసిన జనసైనికులు ఆత్మరక్షణలో పడ్డారు. పవన్ ప్యాకేజీ స్టార్ తప్ప పాలకుడు కాదని మేం చెబుతూనే ఉన్నాం. పవన్ పూజకు పనికిరాని పువ్వు లాంటి వ్యక్తి. పాలకుడిని కాదు.. పాలేరునని పవన్ ఒప్పుకున్నారు. టీడీపీతో పొత్తు ఉన్నప్పటికీ జనసేన నేతల పేరుతో టీడీపీ వారే పోటీ చేస్తారు. జనసైనికులు కూడా పాలేరులుగా మారకుండా నిర్ణయం తీసుకోవాలి. గతంలో పవన్ కుటుంబ సభ్యులను సైతం చంద్రబాబు మనుషులు బూతులు తిట్టారు. పార్టీ పెట్టి పదేళ్లయినా పవన్ ఏమీ సాధించలేక పోయాడు. చంద్రబాబు కుతంత్రాలు ఇలాగే ఉంటాయి. పాలకుడు ఎవరో, పాలేరు ఎవరో గుర్తించి వ్యవహరించాలి అంటూ సూచనలు చేశారు.

# ఆర్–5 జోన్ పనులను అడ్డుకున్న అమరావతి రైతులు



అమరావతి: రాజధాని పరిధిలోని ఆర్–5 జోన్‌లో పనులను రైతులు అడ్డుకున్నారు. తుళ్లూరు మండలం దొండపాడులో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు పనులు, భూమి చదును కోసం పొక్లెయిన్లతో వచ్చిన సీఆర్డీయే అధికారులను రైతులు అడ్డుకుని వెనక్కి పంపారు. దీంతో అధికారులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇళ్ల స్థలాలకు తామేమీ వ్యతిరేకం కాదని.. ఆర్–3 జోన్‌లో ఇచ్చుకోవచ్చని చెప్పారు. ఎలక్ట్రానిక్ సిటీకి కేటాయించిన ప్రాంతంలో ఇళ్ల స్థలాల పేరుతో కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పేదలను మభ్యపెట్టేందుకునే సీఎం జగన్ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలో ఆర్–5 జోన్‌ను నిరసిస్తూ తుళ్లూరులో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. దీక్షా శిబిరం నుంచి సీఆర్డీఏ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. సెంటు భూమి వద్దు టిడ్కో ఇల్లు ముద్దు అంటూ నినాదాలు చేశారు. సీఆర్‌డీఏ కార్యాలయంలోకి వెళ్లేందుకు రైతులు యత్నించగా పోలీసులు గేట్లు వేసి అడ్డుకున్నారు. రైతులు నెట్టుకుంటూ లోపలికి వెళ్లి కార్యాలయం వద్ద బైఠాయించారు. అనంతరం ఆర్–5 జోన్ రద్దు చేయాలంటూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ప్రభుత్వం మొండిగా వెళ్తే ఎక్కడికక్కడ తీవ్రంగా ప్రతిఘటిస్తామని రైతులు హెచ్చరించారు.

# ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట.. రెండు వారాల బెయిల్ మంజూరు!

ఇస్లామాబాద్: అల్ ఖాదీర్ ట్రస్ట్ కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్– ఎ– ఇన్సాఫ్ పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. ఈ కేసులో ఇస్లామాబాద్ హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం ఆయనకు రెండు వారాల బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందు.. ఇమ్రాన్‌కు సంఘీభావంగా పెద్దఎత్తున అభిమానులు కోర్టు వద్దకు చేరుకున్నారు. భారీ బందోబస్తు మధ్య ఆయన్ను కోర్టులో హాజరుపర్చారు. ఈ క్రమంలోనే ద్విసభ్య ధర్మాసనం ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపింది. భద్రతా కారణాలతో విచారణ మధ్యలో రెండు గంటలపాటు వాయిదా పడినా.. చివరకు ఆయనకు బెయిల్ దక్కింది. ఇదిలా ఉండగా.. ఇదే కేసులో ఈ కోర్టు ప్రాంగణంలోనే మంగళవారం ఇమ్రాన్ ఖాన్‌ను పాక్ రేంజర్లు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా ఇమ్రాన్ మద్దతుదారులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే సుప్రీం కోర్టు.. ఇమ్రాన్ అరెస్టు అక్రమమని ప్రకటించింది. ఆయన్ను విడుదల చేయాలని ఆదేశించింది. దీంతోపాటు ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించి.. ఆ న్యాయస్థానం నిర్ణయానికి అనుగుణంగా నడుచుకోవాలని ఇమ్రాన్‌కు సూచించింది. ఈ క్రమంలోనే నేడు ఆయనకు బెయిల్ లభించింది. అంతకుముందు.. హింసకు ప్రేరేపించారన్న ఓ కేసులోనూ ఇమ్రాన్ ఖాన్‌కు ఇక్కడి ఉగ్రవాద నిరోధక కోర్టు మే 23 వరకు బెయిల్ మంజూరు చేసింది.

## బొమ్మను చూస్తే అది నీలా ఉంది..!

'బొమ్మరిల్లు' చిత్రంలోని ఈ క్లాసిక్ సాంగ్ ని తెలుగు ప్రేక్షకులు అంత తేలిగ్గా మర్చిపోలేరు. ఇదిగో ఇక్కడ చూస్తున్న ముద్దుగుమ్మ సినీకవులు వర్ణించినట్టు అచ్చం బొమ్మను తలపిస్తోంది కదూ? బార్బీ బొమ్మకు జెరాక్స్ కాపీలా.. అమ్మో బొమ్మకు కజిన్ సిస్టర్ లా ఉంది.. అంటూ ఈ ఫోటోలు చూశాక అభిమాలు కామెంట్లు చేస్తున్నారు. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అందాల ఆడ బొమ్మ.. యువనాయికల్లోనే క్రేజీ డాళ్ గా పాపులరైంది. నటవారసురాళ్ల కేటగిరీలో తనకు ఎదురే లేదని ప్రూవ్ చేస్తోంది. తనదైన అందం కవ్వింత గ్లామరస్ యాంగిల్ తో కట్టి పడేస్తోంది. ఇప్పుడు ఇలా ఈ బొమ్మ ఏనుగు బొమ్మ ఉన్న లెదర్ బ్యాగ్ కి పడిపోయింది. ఈ బ్యాగుతో ప్రేమలో ఉన్నాను! అంటూ



ఓపెన్ స్టేట్ మెంట్ ఇచ్చింది. నిజానికి ఆ అందమైన బ్యాగ్ పై ఏనుగు బొమ్మలతో డిజైన్ చూడగానే ముచ్చటపడకుండా ఉండలేరు ఏ మగువ అయినా. మొత్తానికి అందాల ఆడబొమ్మ అనన్య పాండే బ్రాండ్స్ ప్రమోషన్స్ లోను దూసుకుపోతోందనడానికి ఇది ఒక ఉదాహరణ. ఓవైపు సినిమాలు.. మరోవైపు వాణిజ్య ప్రకటనల ఆదాయంతో టాప్ ఎర్నర్ గా రాణిస్తోంది. ఇక టాప్ టు బాటమ్ బ్రౌన్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో కనిపించిన అనన్యను చూసి అభిమానులు రకరకాల కామెంట్లతో చెలరేగిపోతున్నారు. ఒక వీరాభిమాని తనతో నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నానని వెల్లడించగా.. మరొక అభిమాని లవ్ యు అన్నీ! అంటూ మురిపెంగా పిలిచాడు. ఐ లవ్ విత్ దిస్ ప్రెట్టీ గాళ్! అంటూ మరో అభిమాని ప్రేమను కురిపించాడు.

ఇంత అందమైన బొమ్మతో ప్రేమలో పడడం సులువే కానీ.. ఆ తర్వాత సర్వం అర్పించుకోవాల్సి ఉంటుంది బోయ్స్.. అంటూ కొందరు ఎన్ కౌంటర్ చేస్తున్నారు. మొత్తానికి అనన్య పాండే అందానికి క్లీన్ బౌల్డ్ కాని యువకుడు లేనే లేడు. అనన్య కెరీర్ మ్యాటర్ కి వస్తే.. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2- పతి పత్నీ ఔర్ వో- అంగ్రేజీ మీడియం- ఖలీ పిలీ- లైగర్ చిత్రాల్లో నటించిన ఈ బ్యూటీ తదుపరి వరుస చిత్రాలతో బిజీగా ఉంది. డ్రీమ్ గర్ల్ 2లో ఆయుష్మాన్ ఖురానా సరసన నటిస్తోంది. 'ఖో గయే హమ్ కహాన్' చిత్రీకరణ దశలో ఉంది. యూత్ లో భారీ క్రేజ్ ఉన్న ఈ భామ ఒక్కో సినిమాకి 5 కోట్లు డిమాండ్ చేస్తోందని సమాచారం. అలాగే ఒక్కో బ్రాండ్ ప్రమోషన్ కోసం కోట్లలో ప్యాకేజీలు అందుకుంటోంది.

## అందాల హీరోయిన్కు ఇక్కడా తిరస్కారమే

'అందాల రాక్షసి' సినిమాలో లావణ్య త్రిపాఠిని చూసి నిజంగా ఆమె అందాల రాక్షసే అనుకున్నారు కుర్రాళ్లు. ఆ సినిమా కమర్షియల్గా పెద్ద సక్సెస్ కాకపోయినా.. అందులో లావణ్య పాత్ర తన అందం తన హావభావాలకు చాలామంది ఫిదా అయిపోయారు. ఆ సినిమాతో వచ్చిన పేరు.. లావణ్యకు చాలా అవకాశాలే తెచ్చిపెట్టింది. అందులో దూసుకెళ్తా భలే భలే మగాడివోయ్ సోగ్గాడే చిన్నినాయనా లాంటి హిట్లు కూడా ఉన్నాయి. ఐతే ఈ విజయాలు ఇచ్చిన ఊపును తర్వాత లావణ్య కొనసాగించలేకపోయింది. సరైన సినిమాలు పాత్రలు ఎంచుకోలేక ఆమె చూస్తుండగానే ఫేడవుట్ అయిపోయింది. సినిమాల నుంచి దాదాపు కనుమరుగు అవుతున్న దశలో లావణ్య ప్రధాన పాత్రలో 'హ్యాపీ బర్త్డే' అనే సినిమా వచ్చింది. కానీ ఆ సినిమా కూడా బోల్తా కొట్టేయడంతో లావణ్య ఫిలిం కెరీర్ దాదాపుగా ముగిసిపోయింది. సినిమాల మీద ఆశలు వదులుకుని ఓటీటీల్లో అయినా కొత్త కెరీర్ వెతుక్కుందామని అనుకుంది అందాల



రాక్షసి. కానీ ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన 'పులి-మేక' సైతం నిరాశకు గురి చేసింది. డిజిటల్ ఎంట్రీలోనూ ఆమెకు ఆశించిన ఆరంభం దక్కలేదు. జీ5లో ప్రసారమైన 'పులి-మేక' ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇందులో లావణ్య చేసిన పోలీస్ క్యారెక్టర్ ఓకే అనిపించినా.. కొన్ని ట్విస్టులు బాగున్నా.. ఓవరాల్గా ఈ సిరీస్ ప్రేక్షకులను సంతృప్తిపరచలేకపోయింది. దీంతో ఓటీటీలోనూ లావణ్య ఖాతాలో ఇంకో ఫ్లాప్ జమ అయింది. దీని తర్వాత ఆమెకు ఇంకో వెబ్ సిరీస్లో అవకాశం దక్కుతుందా అన్నది సందేహమే. ఎలాంటి హీరోయిన్ అయినా వరుసగా ఫెయిల్యూర్లు ఎదురైతే ఒక నెగెటివ్ ముద్ర పడిపోతుంది. లైమ్ లైట్కు దూరం కాక తప్పదు. లావణ్య ప్రస్తుతం అలాంటి స్థితిలోనే కనిపిస్తోంది. ఇక్కడి నుంచి ఆమె ఏమాత్రం పుంజుకుంటుందో చూడాలి.




## టాప్ యాంగిల్ పిక్స్ తో పిచెక్కిస్తున్న జాతిరత్నం



జాతిరత్నాలు సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యి మొదటి సినిమా తోనే మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ ఫరియా అబ్దుల్లా. ఈ అమ్మడు జాతిరత్నాలు సినిమా తర్వాత వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుందని అంతా భావించారు కానీ అలా కాలేదు. ఈ మధ్య మెల్ల మెల్లగా ఆఫర్లు ఈ అమ్మడి తలుపు తడుతున్నాయి. రవితేజ రావణాసుర సినిమాలో కీలక పాత్రలో నటించిన విషయం తెల్సిందే. కానీ ఆ సినిమా కూడా ఈ అమ్మడికి గుర్తింపు తెచ్చి పెట్టలేక పోయింది. ప్రస్తుతం రెండు మూడు సినిమాల్లో నటిస్తున్న ఫరియా అబ్దుల్లా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత తో సందడి చేస్తూనే ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు ఇలా టాప్ యాంగిల్ లో క్లీ వేజ్ షో చేస్తూ అందాల ఆరబోత చేస్తూ ఆకట్టుకుంది. డార్క్ షేడ్స్ లో పడుకుని టాప్ యాంగిల్ లో కెమెరాకి ఫోజ్ ఇచ్చిన ఫరియా అందాల ఆరబోతకు నెటిజన్స్ తెగ ఫిదా అవుతున్నారు. ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ స్థాయి అందాల ఆరబోత చేసినా కూడా ఫరియా ను ఫిల్మ్ మేకర్స్ పట్టించుకోవడం లేదు అంటూ కొందరు అభిమానులు సోషల్ మీడియా ద్వారా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా ఈ అమ్మడికి స్టార్స్ సినిమాల్లో... పెద్ద సినిమాల్లో ఛాన్స్ రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## రాశిఖన్నా సోకుల విరియానా



టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ రాశి ఖన్నా. ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ తరువాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస అవకాశాలు సొంతం చేసుకుంటూ వచ్చింది. అటు గ్లామర్ పాత్రలతో పాటు ఇటు నటిగా తన మార్క్ నిలిచిపోయే క్యారెక్టర్స్ తో కూడా రాశి ఖన్నా తెలుగునాట ప్రూవ్ చేసుకుంది. ప్రస్తుతం ఉన్న యువ స్టార్స్ లో చాలా మందితో ఈ అమ్మడు ఆడిపాడింది. ఆమె చివరిగా తెలుగులో పక్కా కమర్షియల్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమా ఎవరేజ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ అమ్మడు హిందీలో ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ సినిమాలో ఇంటరెస్టింగ్ రోల్ లో కనిపించి మెప్పించిన ఈ అమ్మడు హిందీలో కూడా మెల్లగా అవకాశాలు పెంచుకుంటుంది. ఇక హిందీ ప్రేక్షకులకి చేరువ కావడానికి రాశిఖన్నా తన గ్లామర్ డోస్ పెంచింది అని చెప్పాలి. అందులో భాగంగా ఈ మధ్యకాలంలో అందాల ప్రదర్శనలో హద్దులు చెరిపేసి అదిరిపోయే డ్రెస్సింగ్ తో హాట్ హాట్ ఫోటోలని షేర్ చేస్తుంది. తాజాగా ఈ భామ క్లీవేజ్ అందాలని కనువిందుగా చూపిస్తూ వయ్యారంగా సోకులు ఒలకబోసింది. ఈ ఫోటోలు నెట్టింట ప్రస్తుతం వైరల్ గా మారాయి. హిందీలో అందాల భామలు హాట్ షోకి ఎప్పుడు సిద్ధంగా ఉంటారు. సినిమాలలో చేసే గ్లామర్ షో కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా హాట్ హాట్ స్కిన్ షోతో రెచ్చిపోయి సందడి చేస్తూ ఉంటారు. అలాంటి భామలని బీట్ చేయాలంటే మనం కూడా వారితో పోటీ పడేలా ఉండాలని రాశిఖన్నా డిసైడ్ చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇక గ్లామర్ షో పెంచితే అయితే వెబ్ సిరీస్ లలో అయినా అవకాశాలు పెరుగుతాయి కదా అనే ఆలోచనతో రాశిఖన్నా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇప్పటికే ఫర్జీ వెబ్ సిరీస్ తో మెప్పించడంతో మరిన్ని వెబ్ సిరీస్ లో అవకాశాలు రావొచ్చని రాశిఖన్నా ఆశపెట్టుకున్నట్లు తెలుస్తుంది.

## రకుల్ హీటెక్కించే అందాలు.. అద్భుతమైన ఫుడ్..!

2009లో గిల్లి అనే కన్నడ సినిమాతో తెలుగు సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన రకుల్ ప్రీత్.. ఆ తర్వాత రెండేళ్లకే కెరటం సినిమాతో తెలుగు సినీ రంగంలోనూ కాలు మోపింది. ఆ తర్వాత తమిళ హిందీ చిత్రాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంది. తెలుగులో వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ రఫ్ లౌక్యం పండగ చేస్కో కిక్ 2 బ్రూస్ లీ నాన్నకు ప్రేమతో సరైనోడు ధృవ విన్నర్ రారండోయ్ వేడుక చూద్దాం జయ జానకీ నాయకా వంటి చిత్రాల్లోనూ నటించి మెప్పించింది. అయితే తెలుగు తమిళ హిందీ కన్నడ భాషల్లో నటించి మెప్పించిన ఈ క్యూట్ బ్యూటీ వరుస చిత్రాల్లో అవకాశాల్లో దక్కించుకుంటూ దూసుకెళ్తోంది. ఈ క్రమంలోనే అన్ని భాషల ఫ్యాన్స్ కు సోషల్ మీడియా ద్వారా అందుబాటులో ఉంటుంది. తనకు సంబంధించిన పర్సన్ లతో పాటు ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన



విషయాలను పంచుకుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టా వేదికగా ఓ ఫొటోను షేర్ చేసింది. అందులో రకుల్ చాలా అందంగా కనిపిస్తోంది. బీచ్ పక్కన ఓ రెస్టారెంట్ తనకు నచ్చిన ఫుడ్ ఐటమ్స్ ఆర్డర్ చేసుకొని తింటోంది. అయితే ఈ ఫొటోలో పలు రకాల ఫిష్ ఐటమ్స్ చాలా ఇంట్రెస్టింగ్ గా కనిపిస్తున్నాయి. అలాగే రకుల్ కూడా చాలా క్యూట్ గా ఉంది. కూలింగ్ గ్లాసెస్ సింపుల్ గా ఓ వాచ్ బ్లాక్ కలర్ ప్రింటెడ్ టాప్ లో చాలా స్టైలిష్ గా ఉంది. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకొని ఫుడ్ వైపే చూస్తోంది. అలాగే ఈ ఫొటోతో పాటు మీరెవరూ నాతో మాట్లాడొద్దు నేను తినేటప్పుడు అనే క్యాప్షన్ కూడా ఇచ్చింది. బై చెప్తూ ఎవరు దీనికి కనెక్ట్ అయ్యారని అడిగింది. అయితే రకుల్ చేసిన ఈ పోస్టుకు విపరీతమైన లైకులు షేర్లు కామెంట్లు వస్తున్నాయి. ఫుల్లుగా తిని ఎంజాయ్ చేయమని కొందరు ఫుడ్ ను బాగా ఎంజాయ్ చేయమని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు. ఫుడ్ ని నువ్వు ఎంజాయ్ చేస్తుంటే నీ అందాలను మేం ఎంజాయ్ చేస్తామని చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం ఈ క్యూట్ బ్యూటీ భారతీయుడు-2 చిత్రంలో నటిస్తోంది. అలాగే తమిళంలోనూ రెండు చిత్రాల్లో నటించనుండగా.. మరోవైపు బీ టౌన్ లోనూ నటిస్తున్నారు.

## సోషల్ మీడియా వెకిలి వేషాలపై 'గురు' నటి ఫైరింగ్

సామాజిక మాధ్యమాల్లో వింత వికృత వెకిలి చేష్టలు సెలబ్రిటీలను తీవ్రంగా హర్ట్ చేస్తున్నాయి. నిరంతరం స్టార్లు తమ వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశించి నీచంగా సంస్కారం లేని బూతులతో హింసించే టీనేజర్లు .. యువతరం పోకడలను వ్యతిరేకిస్తున్నారు. తమకు ఒక కుటుంబం ఉంటుంది. అన్న చెల్లి అక్క తమ్ముడు అమ్మా నాన్న స్నేహితులు ఉంటారు. పెద్ద కుటుంబం ఉంటుంది. రంగుల ప్రపంచంలో వెండితెర కోసం రకరకాల కాస్ట్యూమ్స్ లో కనిపించాల్సి ఉంటుంది. రకరకాల ఫోటోషూట్లు తప్పనిసరి. అది వారి వృత్తి. కానీ ఏదైనా న్యూడిటీని అపరిమితంగా షేర్ లు చేస్తూ వాటికి బూతు కామెంట్లు రాస్తూ సోషల్ మీడియాల్లో యువతరం వెకిలి చేష్టలకు పాల్పడడాన్ని పలువురు సెలబ్స్ ఇప్పటికే తీవ్రంగా గర్హించారు. చాలామంది మీడియా వేదికలుగా తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ఇప్పుడు ఈ జాబితాలో గురు ఫేం రితిక సింగ్ చేరారు. ఇలాంటి చర్యలను సదరు యువనటి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నాకు కూడా ఒక కుటుంబం ఉంది. నాకు అన్న తమ్ముడు తల్లి తండ్రి ఉంటారు.



స్నేహితులు ఉంటారు. వారు సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి వాటిని చూసినప్పుడు తీవ్రంగా ఆవేదన చెందుతారు. తప్పుడు కూతలు రాతలు సరికాదు. హృదయాలు గాయపడతాయి. బాలబాలికలు అభద్రతా భావానికి గురి కాకుండా వారికి బేసిక్ నియమావళిని వివరించాల్సిన వారు తల్లిదండ్రులు గురువులు. ఇతరులను ఎలా గౌరవించాలి? మంచి ఆలోచనలను ఎలా కలిగి ఉండాలి? అన్నది స్కూల్ దశలోనే నేర్పించాలి. పేద తరగతి మధ్య తరగతి లేదా ఇంకేదైనా తరగతి కి చెందినా ఒకరు ఎదుటి వ్యక్తికి గౌరవం ఇచ్చే విధానాన్ని కుటుంబాలు విద్యావ్యవస్థలు పిల్లలకు అలవాటు చేయాలని రితిక సూచించారు. ద్వంద్వార్థాలతో దుష్టత్వంతో సోషల్ మీడియాల్లో పిచ్చి కూతలు కూసే దారుణమైన అహేతుకమైన కల్చర్ ని నాశనం చేయాలంటే దానికి స్కూల్ దశలోనే మార్పు రావాలని సూచించారు. విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలో రితిక ఈ ఇంటర్వ్యూలో వివరించి చెప్పిన విధానం ఎంతో స్ఫూర్తిని నింపుతోంది. అంతేకాదు.. ప్రతి విద్యార్థి (అమ్మాయిలు అబ్బాయిలు) వారానికి ఒకసారి లేదా నెలలో రెండు సార్లు అయినా సెల్ఫ్ డిఫెన్స్ సెమినార్ లలో పాల్గొనాలని కూడా సూచించారు. స్వయం రక్షక సెమినార్ లు విధిగా కండక్ట్ చేయాలి. నేను వెళ్లే కరాటే అకాడెమీలో నేను నాన్నగారితో పాటు సెమినార్ లలో పాల్గొనేదానిని. అలాంటి మార్గదర్శనం నేటితరానికి చాలా అవసరమని రితిక వ్యాఖ్యానించారు. రితిక నటించిన క్రైమ్ థ్రిల్లర్ ఇన్ కార్ వెబ్ సినిమా త్వరలో ఓటీటీలో స్ట్రీమింగుకి రానుంది. లైఫ్ సర్వైవల్ డ్రామా రోడ్ ట్రిప్ రోడ్ ట్రిప్ నేపథ్యంలో ఆద్యంతం ఉత్కంఠ కలిగించే మలుపులతో ఈ ఓటీటీ సినిమా తెరకెక్కింది.



# రైతుబంధుతో చేనుచెలక పచ్చగా మారాయి : మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుబంధు పథకంతో చేనుచెలక పచ్చగా మారాయని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం చలపర్తిలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నిధులతో నిర్మించిన 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 36 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు మాత్రమే ఉండేవని.. తొమ్మిదేళ్లలో 74లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మారుమూల పల్లె ప్రాంతంలో రైతు భూముల విలువ గణనీయంగా పెరిగాయన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాల గొప్పదనం అంతర్జాతీయ స్థాయిలో మారుమోగుతున్నదన్నారు. అకాల వర్షంతో నష్టపోయిన ప్రతి రైతుకు రాష్ట్ర నిధులతో రూ.10వేల నష్ట పరిహారం అందిస్తున్నామన్నారు. రూ.65వేలకోట్లు రైతుబంధుకు రూ.5వేలకోట్లు రైతుబీమాకు అందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఒక వ్యవసాయరంగంపైనే రూ.4.50లక్షలు కోట్లు, సాగునీటి రంగంపై రూ.1.59లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. మక్కల కొనుగోలు కోసం రూ.10వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రం ఈ విధంగా ఖర్చు చేయలేదని, వ్యవసాయ యాంత్రికీకరణ కోసం తప్పకుండా కృషి చేస్తామన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు అనంతరం మారుమూల గ్రామానికి సైతం సాగు, తాగునీరు అందుతుందన్నారు. వడగళ్ల వాన కారణంగా పంట నష్టపోయిన రైతులందరిని ఆదుకునేందకు నర్సంపేట నియోజకవర్గానికి రూ.40కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు రూ.10వేల చొప్పున పరిహారం ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. పండిన పంటకు సరిపడా గోదాములు ఉ న్నాయన్నారు. తెలంగాణ రైతులకు అందుతున్న పథకాలు నేడు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

తడిసిన వడ్లను కూడా కొనాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు: మంత్రి తలసాని




హైదరాబాద్: హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలని సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టిస్తున్నారని చెప్పారు. ఈ ఇండ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గంలోని మురళీధర్‌బాగ్‌లో రూ.10 కోట్లతో నిర్మించిన 120 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంత్రి మహమూద్ అలీతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రూ.2 వేల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఆడబిడ్డ పెండ్లికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నదని పేర్కొన్నారు. పేదల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వలేదని మంత్రి మహమూద్ అలీ అన్నారు. దేశంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. ప్రతి ఇంటికి సురక్షిత మంచి నీరు ఇస్తున్నామని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని వెల్లడించారు. రైతు సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టామన్నారు. పాతబస్తీని సీఎం కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో గంగా జమున తెహజీబ్ సంస్కృతిని కాపాడుతున్నామని చెప్పారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద రూ. 3.50 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సమీపంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మహబూబ్ నగర్, కొత్తగంజ్ పోచమ్మ టెంపుల్ సమీపంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో కలెక్టర్ రవి నాయక్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, టీజీవో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా కార్యదర్శి బక్క శ్రీనివాసులు, టీజీవో యూనియన్ నాయకులు సహదేవ్, హరికృష్ణ, రంజిత్, పరమేశ్వర్ రెడ్డి, యాదగిరి, టైటస్ పాల్, మధుసూదన్ గౌడ్, సంధ్య, విజయ్, వెంకటయ్య, చెన్నకిష్టన్న, టీఎన్జీవో అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రా నాయక్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిలు గౌడ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి రఘురాం రెడ్డి, జడ్పీ సీఈఓ జ్యోతి, డీఈఓ రవీందర్ పాల్గొన్నారు.

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే...

హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త సంవత్సరంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్, బోయిన్‌పల్లిలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటిటేషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశానికి టెక్నాలజీని అందించింది రాజీవ్ గాంధీయేనన్నారు. తెలంగాణ యువతలో మేధో సంపత్తిని బయటికి తెచ్చేందుకు క్విజ్ ఏర్పాటు




చేశారని, పేద కుటుంబం నుంచి వచ్చి ఆస్కార్ అందుకున్న రాహుల్ సిప్లిగంజ్‌ను ప్రభుత్వం గ్రహించకుండా చిన్న చూపు చూసి ఎటువంటి స్వాగతం పలకలేదని విమర్శించారు. టీవీలో ఆస్కార్ అవార్డులు చూడటం తప్ప, ఆస్కార్ అవార్డ్ అందుకున్న వారు తెలుగులో లేరని రేవంత్ అన్నారు. ఆస్కార్ అవార్డ్ అందుకున్న రాహుల్ సిప్లిగంజ్‌కు కాంగ్రెస్ తరపున రేవంత్ రూ. 10 లక్షల నజరానా ప్రకటించారు. క్విజ్‌లో బహుమతులు గెలుపొందిన వారికి ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రేవంత్‌తోపాటు రాష్ట్ర ఇంచార్జి మనిక్‌రావు ఠాక్రే, ఆస్కార్ అవార్డ్ గ్రహీత రాహుల్ సిప్లిగంజ్ తదితరులు పాల్గొన్నారు.

# అతి తీవ్ర తుఫాన్‌గా మోచ.. బెంగాల్‌లో హై అలర్ట్

కోల్‌కతా: మోచ తుఫాన్ ఇప్పుడు అతి తీవ్ర తుఫాన్‌గా మారింది. బంగాళాఖాతం తీర ప్రాంతంపై తుఫాన్ ప్రభావం ఉండనున్నది. బెంగాల్‌లో 200 మంది రెస్క్యూ సిబ్బందితో పాటు ఎన్డీఆర్ఎఫ్ దళాలు అప్రమత్తంగా ఉన్నాయి. స్టాండ్‌బైలో మరో 100 మంది రెస్క్యూ దళం ఉన్నట్లు ఎన్డీఆర్ఎఫ్ సెకండ్ బెటాలియన్ కమాండెంట్ గుర్మిందర్ సింగ్ తెలిపారు.

బెంగాల్ తీర ప్రాంతంలో ఇండియన్ కోస్టు గార్డు దళం కూడా హై అలర్ట్‌లో ఉంది. బంగ్లాదేశ్, మయన్మార్ బోర్డర్ వద్ద ఆ తుఫాన్ తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో గంటకు సుమారు 160 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయి. బంగ్లాదేశ్ కోక్స్ బజార్ ప్రాంతంలో రెండు మీటర్ల మేర వర్షం పడే ఛాన్సు ఉందని ఐఎండీ చెప్పింది. బంగాళాఖాతంలో ఈశాన్యం దిశగా వెళ్లకూడదని జాలర్లకు వెదర్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా అలర్ట్ జారీ చేశారు. అండమాన్ నికోబార్ దీవుల్లోనూ అలర్ట్ ప్రకటించారు. త్రిపుర, మిజోరంలో భారీ స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నాగాలాండ్, మణిపూర్, సౌత్ అస్సాంలో స్వల్ప స్థాయిలో వర్షం కురవనున్నది. ఈసారి తుఫాన్‌కు మోచ అనే పేరును యెమెన్ దేశం సూచించింది. ఆ దేశంలో



మోచ ఓ చిన్న గ్రామం. అక్కడ ఫిషింగ్ ఎక్కువగా జరుగుతుంది. కాఫీ ఉ త్పత్తిలోనూ ఆ ఊరుకు ప్రత్యేక పేరుంది.




దిల్లీ: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 10, 12వ తరగతి ఫలితాలు వచ్చేశాయి. తొలుత ఉదయం 12వ తరగతి ఫలితాలు విడుదల చేసిన అధికారులు.. కొద్ది గంటల్లోనే 10వ తరగతి రిజల్ట్స్ ఇచ్చారు. విద్యార్థులు తాము సాధించిన స్కోరును cbse.gov.in, https://cbseresults.nic.in/ వెబ్‌సైట్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. రోల్ నంబర్, పుట్టిన తేదీ, స్కూల్ నంబర్, అడ్మిట్ కార్డు నంబర్‌లను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు. అలాగే, డిజీలాకర్, ఉమాంగ్ మొబైల్ యాప్‌ల ద్వారా కూడా రిజల్ట్స్ పొందొచ్చు. సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 21వ తేదీ వరకు జరిగాయి. ఈ పరీక్షలకు 21లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 93.12 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతేడాది (94.40శాతం)తో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత 1.28శాతం తగ్గింది. అత్యధికంగా తిరువనంతపురంలో 99.91శాతం, బెంగళూరులో 99.18శాతం, చెన్నైలో 99.14శాతం ఉత్తీర్ణత నమోదైంది. 1,95,799 మంది విద్యార్థులకు 90శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. ఇందులో 44,297 మంది 95శాతం కంటే ఎక్కువ స్కోరు సాధించినట్లు బోర్డు తెలిపింది. విద్యార్థుల మధ్య అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు 12వ తరగతి మాదిరిగానే 10వ తరగతి విద్యార్థులకూ మెరిట్ లిస్ట్‌ను ప్రకటించట్లేదని సీబీఎస్ఈ వెల్లడించింది. మే 16వ తేదీ నుంచి రీ ఎవాల్యుయేషన్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఇక, ఈ ఉదయం విడుదలైన సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో 87.33శాతం మంది ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే.




కొండగట్టులో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఊరేగింపులో మహిళలు కోలాటాలతో ఆకట్టుకున్నారు.

# టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో మరో 8 మందికి బెయిల్

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో మరో 8మందికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. 50వేల పూచీకత్తులు రెండు సమర్పించాలని ఆదేశించింది. పోలీసు విచారణకు సహకరించాలని, నిర్దేశించిన తేదీల్లో సిట్ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. నీలేష్ నాయక్, కేతావత్ శ్రీనివాస్, రాజేందర్ నాయక్‌తో పాటు మరో ఐదుగురికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో రేణుక రాథోడ్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.50వేల పూచీకత్తు, పాస్ పోర్టు సమర్పించాలని.. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో సిట్ ఎదుట హాజరు కావాలని కోర్టు రేణుకను ఆదేశించింది.

చంచల్‌గూడ మహిళా జైలులో రిమాండ్‌లో ఉన్న రేణుక గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ ఇంజనీర్, ఏఈఈ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ఏ3గా ఉన్న రేణుక కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలున్న విషయం తెలిసిందే. ఇదే కేసుకు సంబంధించి రమేశ్, ప్రశాంత్‌లకు కూడా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కాగా రేణుక భర్త ఢాక్యా నాయక్ జైల్లోనే ఉన్నారు. అతను పలుమార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా కోర్టు తిరస్కరించింది.

# ఆ యువతిని ఎస్ఐ భార్య ఏమీ అనలేదు..

జగిత్యాల: బీఆర్ఎస్ ప్రభుత్వంపై బీజేపీ ఎంపీ అరవింద్ మండిపడ్డారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ భార్య ఆత్మ గౌరవం కాపాడుకోలేని పోలీసులకు రివాల్వర్, ఖాకీ డ్రెస్ ఎందుకని ప్రశ్నించారు. బస్సులో ఉన్న యువతిని ఎస్ఐ భార్య ఏమీ అనలేదని.. బుర్కా వేసుకున్న యువతి ఫిర్యాదు ఇస్తే.. ఆగ మేఘాల మీద స్పందిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యల మీద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టి పెట్టాలని ఎంపీ అరవింద్ సూచించారు. ప్రభుత్వం సక్రమంగా పని చేస్తే.. ఒక్క ధాన్యం గింజ కూడా వృథా కాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు రావాలన్నారు. ట్విట్టర్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీని విమర్శించడం మానెయ్యాలని మంత్రి కేటీఆర్‌కు సూచించారు. ఎకరా పంట నష్టంకు రూ. పది వేలు ఏవని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అరవింద్ ప్రశ్నించారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్తుండగా టీఎస్ఆర్టీసీ బస్సులో సీటు విషయంలో ఎస్ఐ అనిల్‌కుమార్ భార్య.. షేక్ ఫర్హా అనే మహిళ గొడవపడ్డారు. ఈ సంఘటన గురించి ఎస్ఐ భార్య..




అతనికి ఫోన్‌లో చెప్పారు. దీంతో బస్సు జగిత్యాలకు చేరుకోగానే ఎస్ఐ.. బస్సును ఆపి.. ఫర్హాను ప్రశ్నించారు. ఈ ఘటనను ఫర్హా తన మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేస్తుండగా.. ఆమె నుంచి ఫోన్ తీసుకున్నారు. దీంతో పోలీసులు తనపై, తన తల్లిపై దాడి చేసినట్లు షేక్ ఫర్హా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన పోలీస్ ఉన్నతాధికారులు గురువారం ఎస్ఐ అనిల్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# నిర్మల్ మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ అనుమతి.. హర్షం వ్యక్తం చేసిన మంత్రి ఐకేరెడ్డి

సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. నిర్మల్ లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీకి శనివారం అనుమతి ఇచ్చింది. కళాశాలలో 100 ఎంబీబీఎస్ సీట్ల అనుమతులు జారీ చేసింది. దాంతో జిల్లాకో మెడికల్ కాలేజీ అమలులో మరో ముందడుగు పడ్డట్లయ్యింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాలేజీ మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, ప్రత్యేక చొరవ చూపిన వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2023- 2024 నుంచి మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయన్నారు. నిర్మల్ జిల్లా ప్రజలు ఎంతోకాలంగా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజల కోరిక మేరకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం రాష్ట్ర



ప్రభుత్వం గతేడాది ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నిధులు కేటాయించింది. మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కూడా కేటాయించింది. దీంతో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# వనస్థలిపురంలో దారుణం.. భార్యను వెంబడించి గొంతు కోసి హతమార్చిన భర్త

వనస్థలిపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త.. తన భార్యను గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన నగరంలోని వనస్థలిపురం పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపోచమ్మవాడకు చెందిన కుంచం రాజ్‌కుమార్ హైకోర్టు వద్ద ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య శోభ(40), ఇద్దరు కుమారులతో కలిసి గత రెండేళ్లుగా వనస్థలిపురంలోని గౌతమినగర్‌లో అద్దెకు ఉంటున్నారు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఏదో విషయంలో దంపతులిద్దరూ తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. ఈ విషయం కుటుంబ పెద్దల వరకు వెళ్లడంతో వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రాజ్‌కుమార్, శోభ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహంతో ఉన్న రాజ్‌కుమార్ భార్య శోభపై చేయి చేసుకున్నాడు.

ఆమె అతని నుంచి తప్పించుకునేందుకు పైఅంతస్తు నుంచి కిందికి పరిగెత్తింది. రాజ్‌కుమార్ కత్తితో ఆమెను వెంబడించి గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. తల్లిపై దాడికి పాల్పడిన తండ్రిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన పెద్దకుమారుడు సాత్విక్ (15) కూడా గాయపడ్డాడు. అనంతరం అక్కడి నుంచి రాజ్‌కుమార్ పరారయ్యాడు. తల్లిని హత్య చేస్తుండగా చూసిన సాత్విక్ పీఎస్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించాడు. ఎల్బీనగర్ డీసీపీ శ్రీసాయి, ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com